నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 21-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి:30 సంచిక:251 పేజీలు:6 వెల: రూ.1/-

పేదల సంక్షేమానికి బీఎల్ఆర్ ట్రస్ట్ కృషి స్ఫూర్తిదాయకం : మంత్రి పొన్నం

హైదరాబాద్, జూన్ 20 : అన్ని వర్గాల సంక్షేమానికి బీఎల్ఆర్ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చర్లపల్లి డివిజన్ చక్రీపురంకు చెందిన పెరపు నర్సింహ్మ, దేవమణి దంపతుల కుమారుడు ప్రశాంత్ ఉస్మానియా వైద్యశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు.

పేద కుటుంబానికి చెందిన అతడు ఫీజు కట్టకపోవడంతో స్థానికులు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిదృష్టికి తీసుకెళ్లారు.

వెంటనే బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా మంత్రి చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో మెడిసిన్ సీట్ సాధించిన పేద విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఐదు సంవత్సరాల ఫీజులు చెల్లించడం హర్షనీయమన్నారు. నియోజకవర్గ పరిధిలో పేదల సంక్షేమం కోసం ట్రస్ట్ ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తి దాయకమ న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేమూరి మహేశ్‌గౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురక

అడ్డు అదుపు లేని
అవినీతి అక్రమాలు
అధికారంలున్నప్పుడు
అయిపోతవి సక్రమాలు

ఓడంగనే ఒల్లువిరిచి
ఒక్కొక్కటి బయటపడు
గెలిచినోళ్లు దర్యాప్తులు
గాలికిడిస్తే మూలపడు

-వేల్పుల నారాయణ
9440433475

యువ సాధికారత సదస్సుకు హాజరైన ప్రధాని

- ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాల అందజేత

న్యూఢిల్లీ, జూన్ 20 :ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల జమ్ము కశ్మీర్ పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం యువతతో యువ సాధికారత పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీనగర్‌లోని షేర్-ఏ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

ఆకాంక్షలను నెరవేర్చాలనుకునే సమాజం కేవలం సామర్థ్యం గీటురాయిగా ముందుకెళుతుందని అన్నారు. తమ ప్రభుత్వ సామర్థ్యం చూసిన దేశ ప్రజలు తమకు మూడోసారి అధికారం అప్పగించారని చెప్పారు. తమ ప్రభుత్వం శక్తిమేర పనిచేసి ఆ ఫలితాలను ప్రజలకు చేరవేస్తుందని తెలిపారు.

మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా భారత్‌లో సుస్థిరతను ప్రపంచానికి చాటుతూ సందేశం పంపామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ పలువురు యువతీ, యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలు అందచేశారు.

సాధ్యమైనంత త్వరలో జాబ్ క్యాలెండర్ : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 20 :సాధ్యమైనంత త్వరలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గ్రూప్ 2, గ్రూప్ 3 ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు, నిరుద్యోగ యువత గురువారం ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. విద్యార్థుల ధర్నాపై మంత్రి స్పందిస్తూ? త్వరలో గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలను ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాల ఖాళీలను గుర్తించి త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము చెప్పిన మాటలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. కొందరు విద్యార్థులు, నిరుద్యోగ మిత్రులు ఈరోజు ధర్నా చేస్తున్నట్లుగా తనకు తెలిసిందని శ్రీధర్ బాబు అన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో లీగల్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు నిపుణులతో చర్చిస్తున్నట్లు చెప్పారు.

జీవో 46 బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నీట్ పరీక్ష అవకతవకలపై కేంద్రం స్పందించాలని అన్నారు మంత్రి శ్రీధర్‌బాబు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సింగరేణిని కాపాడుకుంటాం..ప్రధానిని కలసి మాట్లాడతాం - ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, జూన్ 20 :సింగరేణిని కాపాడుకోవడానికి అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలుస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శ్రావణపల్లి బొగ్గు గనులను కేంద్రం వేలం వేస్తోందని ఈ విషయమై కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలుస్తామన్నారు. ఖమ్మంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ? సింగరేణి, బొగ్గు గనులపై బీఆర్ఎస్ నేతల తీరు దొంగే దొంగ అని అరిచినట్లుగా ఉందన్నారు. గనుల వేలం సమయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల వ్యాఖ్యలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని మండిపడ్డారు.

సింగరేణి సంస్థలో 42 వేల మంది రెగ్యూలర్, 6 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థ ద్వారా 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి తన ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయిందని అన్నారు. ఏనాడు ఉద్యోగులను పట్టించుకోని గత ప్రభుత్వం ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల మాటలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని అన్నారు. 2031-32 వరకు బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని సింగరేణి నిలబెట్టుకోవాలన్నా.. ఉద్యోగుల మనుగడ కొనసాగాలన్నా కేంద్రం నిర్వహించే గనుల వేలంలో సింగరేణి యాజమాన్యం తప్పనిసరిగా కొత్త బొగ్గు గనులను సొంతం చేసుకోవాల్సిందేనని అన్నారు. లేని పక్షంలో సింగరేణి సంస్థ చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న కోల్ బ్లాక్స్ అన్నింటిని కూడా ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఇస్తే బాగుండేదీ అన్నారు.

కానీ, 2015 సంవత్సరంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మైన్స్ అండ్ మినరల్స్ డెవెలప్‌మెంట్ రెగ్యూలేషన్ యాక్ట్-1957 యాక్ట్‌లో సవరణ తీసుకొచ్చి దేశంలో ఉన్న బొగ్గు గనులను అన్నింటిని ప్రభుత్వ రంగ సంస్థకు నేరుగా ఇవ్వకుండా.. వేలంపాట ద్వారా ప్రైవేటు రంగ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేసిందన్నారు. మైన్స్ అండ్ మినరల్స్ డెవెలప్‌మెంట్ రెగ్యూలేషన్ యాక్ట్-1957 యాక్ట్‌లో సవరణ బిల్లుకు పార్లమెంటులో ఆనాడు బీఆర్ఎస్ కూడా మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. నేడు సింగరేణి విషయంలో బీఆర్ఎస్ తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్లుగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు.

బొగ్గు గనుల వేలం సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల మాటలు రాష్ట్రానికి మంచివి కాదన్నారు. దేశంలో ఉన్న బొగ్గు గనులను ప్రభుత్వ సంస్థలకు దక్కకుండా చేయాలని బీజేపీ చట్టం తీసుకు వచ్చిందని ఆరోపించారు. అందుకే బొగ్గు గనులు పొందాలంటే వేలంలో పాల్గొనాలని షరతు విధించిందన్నారు.

అధునాతన సాంకేతిక కేంద్రాలుగా మన ఐటీఐలు

- టిపిసిసి అధికార ప్రతినిధి భవాని రెడ్డి

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అధునాతన సాంకేతిక కేంద్రాలుగా మన ఐటీఐలు అని టిపిసిసి అధికార ప్రతినిధి భవాని రెడ్డి అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 2324 కోట్ల చేపట్టిన ఐటీఐల ఆధునీకరణ కేంద్రాన్ని భవాని రెడ్డి నేడు మల్లేపల్లి ఐటీఐ సందర్శించి విధి విధానాల గురించి మాట్లాడారు. ఆధునిక పరిశ్రమల (ఇండస్ట్రీ 4.0) అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ రాష్ట్రం లోని 65 ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది.

ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకురాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో పదేళ్ల అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఏటీసీలకు సంబంధించిన ముఖ్య అంశాలు.

- ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు.

- శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమించింది వారు ఆూ లకు శిక్షణ ఇస్తారు.

-ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘ కాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక (షార్ట్ టర్మ్) కోర్సుల్లో శిక్షణ అందిస్తారు.

-గత పదేళ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారు.

- ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి.

-ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.

- ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయి. అని భవాని రెడ్డి చెప్పుకొచ్చారు.

317 జీవో వల్ల నష్టపోయాం.. డిప్యూటీ సీఎంకు 2012 బ్యాచ్ ఎస్ఐల మొర

-మా బ్యాచ్ వాళ్ళకి సెల్యూట్ చేయాల్సి వస్తుంది
-పాత సీనియార్టీ ప్రకారం పదోన్నతులు ఇప్పించండి

హైదరాబాద్, జూన్ 20 :ఒకే బ్యాచ్ లో సర్వీస్ లో చేరినా పదోన్నతుల విషయంలో తీరని అన్యాయం జరిగిందని 2012 బ్యాచ్ ఎస్సైలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి తమగోడును వెల్లబోసుకున్నారు. గురువారం హైదరాబాదులో ఉప ముఖ్యమంత్రిని కలిసి 2012 బ్యాచ్ లో 146 మంది ఎస్సైలుగా ఎంపికయ్యామన్నారు. తమ బ్యాచ్ కి చెందిన 42 మందికి ఇన్స్పెక్టర్ లుగా 2021-22 ప్యానెల్ లో పదోన్నతి కల్పించారని వివరించారు.

317 జీవో వల్ల తాము సీనియార్టీలో వెనుకబడిపోయి 12 ఏళ్లుగా ఎస్సైలు గానే పనిచేస్తున్నామన్నారు. తమ బ్యాచ్ కు చెందిన వారికి తాము సెల్యూట్ చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. పాత సీనియార్టీ ప్రకారం తమకు పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తమ సమస్యను విని సానుకూలంగా స్పందించారని, త్వరలోనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని 2012 బ్యాచ్ ఎస్ఐలు తెలియజేశారు.

బండి సంజయ్‌ను కలిసిన గ్రూప్ 1 అభ్యర్థులు..



హైదరాబాద్, జూన్ 20 :గ్రూప్-1 అభ్యర్థులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను కలిశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం ప్రిలిమ్స్ నుండి 1:100 చొప్పున ఎంపిక చేసేలా చూడాలని నిరుద్యోగులు ఆయనను కోరారు. గత నాలుగేళ్లలో మూడు సార్లు గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని వారు మంత్రి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చిన విషయాన్ని నిరుద్యోగులు గుర్తు చేశారు.

అధికారంలోకి వచ్చి 6 నెలలైనా పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు వాపోయారు. గ్రూప్ 1 పోస్టులు అత్యధికంగా ఉండటం వల్ల 1: 50 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేస్తే నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రంలో గ్రూప్ 1 మెయిన్స్ కు 1:75 చొప్పున ఎంపిక చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేశారన్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే భారీ ఎత్తున ధర్నా చేస్తామని నిరుద్యోగులు తెలిపారు. నిరుద్యోగుల డిమాండ్ న్యాయమైనదేనని బండి సంజయ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేయాలని బండి సంజయ్ అన్నారు. నిరుద్యోగుల డిమాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

అర్వింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ, జూన్ 20 :ఢిల్లీ హైకోర్టులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష పూచీకత్తుతో రూస్ అవెన్యూ కోర్టు ఆయనకి బెయిల్ మంజూరు చేసింది.

తిరుమలలో పారిశుద్ధ్య లోపంపై సంబంధిత అధికారికి షోకాజ్ నోటీస్ జారీ

తిరుపతి, జూన్ 20 : టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులతో కలిసి గురువారం నారాయణగిరి షెడ్ల వద్ద వివిధ క్యూ లైన్లను పరిశీలించారు. ఇందులో భాగంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు వెళ్లే సర్వ దర్శనం, స్లాటెడ్ సర్వ దర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం క్యూ లైన్లను ఆయన తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ఇంజినీరింగ్, విజిలెన్స్ అధికారులకు పలు సూచనలు చేశారు. నారాయణగిరి షెడ్లలోని క్యూలైన్ల పరిశీలనలో భాగంగా సరైన పారిశుద్ధ్య చర్యలు లేకపోవడంతో సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు.

రాబోయే రోజుల్లో కురిసే వర్షాల వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈవో శ్యామల రావు ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో భారీ వర్షాలకు బండరాళ్లు కూలి దెబ్బతిన్న ఘాట్ రోడ్ల పునరుద్ధరణ పనులను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

తిరుపతిలోని కళ్యాణి డ్యాంతో పాటు, తిరుమలలో భక్తులకు ప్రధాన నీటి వనరులైన ఐదు డ్యాముల గురించి వివరించారు. సమీక్షలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, నీ ఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఈఈలు, అధికారులు పాల్గొన్నారు.

త్వరలో తిమ్మాపూర్ మండలంలో పర్యటిస్తా....

-రేపటి యోగాలో కార్యకర్తలందరూ పాల్గొనాలి.
-తిమ్మాపూర్ బిజెపి శ్రేణులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ..

కరీంనగర్, జూన్ 20 : (నేటినిజం ప్రతినిధి) పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత వివిధ మండలాల పర్యటన సందర్భంగా ముందుగా తిమ్మాపూర్ మండలంలో పర్యటిస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ శ్రేణులతో పేర్కొన్నట్లు పార్టీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి తెలిపారు. కేంద్ర మంత్రి గా మొదటిసారి కరీంనగర్ వచ్చిన ఆయనను తిమ్మాపూర్ మండల బీజేపీ కార్యకర్తలు గురువారం ఆయన నివాసంలో కలిసారు. పూల బొకే అందించి, శాలువాతో సన్మానం చేసారు. వివిధ కార్యక్రమాలలో బిజీ గా ఉన్నందున మండలాల వారిగా కార్యకర్తలతో కలవలేకపోతున్నానని పేర్కొనట్లు అధ్యక్షులు తెలిపారు. యోగా తో భారత దేశానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని, దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు కార్యకర్తలు, ప్రజలతో కలిసి రేపటి యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి పేర్కొన్నట్లు తెలిపారు.

అలాగే ప్రజలేదుర్కొంకొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు వారికి అందుబాటులో ఉండాలని సూచించినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నట్లు తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, మండల కార్యదర్శి మాడిశెట్టి వెంకటేశం, బీజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,తొర్తి సంతోష్,కిసాన్ మోర్చా అధ్యక్షులు కంది రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్,మహిళా మోర్చా అధ్యక్షురాలు చింతం వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి జాడి రవళి,వివిధ గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు చింతల సంపత్ రెడ్డి,వెలుగు మధు,రేగూరి సుగుణాకర్, సింగిరెడ్డి పవన్ సాయిరెడ్డి, పాటకుల చొక్కయ్య, మామిడి రాజు,ఆర్లి అన్వేష్,మాడిశెట్టి సత్యనారాయణ,గట్టు రాజు, మహేష్ తదితరులు ఉన్నారు.

నేటి కందం- నేటికీ అందం

మత్సరములు పోనాడుచు
సత్సాంగత్యమును జేసి సన్మిత్రులతో
వత్సలులు జరుపుకోవలె
సుత్సాహముతో ప్రపంచ యోగాదినమున్

(జూన్ 21 ప్రపంచ యోగా దినం)

-రాధశ్రీ
సెల్:9494481210

ఆహ్వానం

ప్రమీలాశక్తి పీఠం

అంకితోత్సవం, అవార్డు ప్రదానోత్సవం

'ఆర్షకవి' ఆచార్య మసన చెన్నప్ప రచించిన

"నాచూపు దేశం వైపు" కవితాసంపుటి ఆవిష్కరణ

తేది: 23-06-2024, ఆదివారం ఉదయం 10.30గం.లకు
వేదిక శివానందాశ్రమం, పద్మారావునగర్, సికింద్రాబాద్.

సభాధ్యక్షులు : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
అధ్యక్షులు, జాతీయ సాహిత్యపరిషత్తు

ముఖ్యఅతిథి : శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు
ప్రముఖ సాహితీవేత్త, సినీకవి

విశిష్టఅతిథి : శ్రీ బైసదేవదాసు ఎడిటర్, నేటినిజం

కృతిస్వీకర్తలు : శ్రీ గూడూరు మహేందర్‌రెడ్డి VHP
ప్రాంతసహ సంపర్క్ ప్రముఖ్,
శ్రీమతి గూడూరు నిర్మల

"ప్రమీల శక్తి పీఠం విశిష్ట సాహితీపురస్కారం 2023" ప్రదానం
ప్రముఖ కవయిత్రి శ్రీమతి రావూరి వసజగారికి

ఆత్మీయ అతిథులు : శ్రీ వామరాజు సత్యమూర్తి
ప్రముఖ సాహితీవేత్త
శ్రీ సిహెచ్. లక్ష్మీనారాయణ
సంస్కృత విద్వాంసులు
డా॥ వెంకటేశ్వర రాజు VHP
ప్రాంత సంపర్క ప్రముఖ్,
డా॥ కస్తూరిలక్ష్మీనారాయణ M.D.(A.M)

అందరికీ ఇదే మా ఆహ్వానం
కార్యక్రమానంతరం భోజనం

యోగాభ్యాసంతో శారీరక మానసిక వికాసం !

(21 జూన్ 'అంతర్జాతయ యోగా దినం' సందర్భంగా)

27 సెప్టెంబర్ 2014న ఐరాస జనరల్ అసెంబ్లీ సర్వసభ్య సమావేశంలో మన ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ భారత సనాతన పతంజలి యోగా సాధన క్రియలతో ప్రపంచ మానవాళికి ఆయురారోగ్యాభాగ్యాలు సిద్ధిస్తాయని 177 దేశాల ప్రతినిధుల సమక్షంలో సగర్వంగా వివరించారు. యోగాతో ప్రకృతికి, మానవజాతికి మధ్య సామరస్యం నెలకొంటుందనే భారతీయ రుషి బోధనలను అర్థం చేసుకున్న ఐరాస 21 జూన్ 2015 నుంచి 'అంతర్జాతీయ యోగా దినం' నిర్వహించేందుకు ఏకగ్రీవంగా అమోదించడం భారతీయులందరికీ గర్వకారణమైంది. ఈ ఏడాది కరోనా విజృంభన నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినం-2024 నినాదంగా 'స్వీయ, సమాజ శ్రేయస్సుకు యోగా (యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ)' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది.

శారీరక మానసిక ఏకీకరణ:

యోగా ఒక శారీరక వ్యాయామమే కాదని విపత్తుల కట్టడిలో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం అత్యవసరమని గ్రహించి యోగా సాధన చేస్తూ వ్యాధినిరోధకశక్తిని పెంచుకున్నాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలతో ప్రపంచ దేశాలు యోగా క్రియలను అభ్యాసం చేయాలని, 2018-2030 ప్రణాళిక ప్రకారంతో యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రపంచ కార్య ప్రణాళిక (గ్లోబల్ ఆక్షన్ ప్లాన్)' ద్వారా సందేశాన్ని అందించారు. శరీరం, మనసు ఏకీకరణకు యోగా సరైన మార్గమని తెలుసుకోవాలి. మానసిక ప్రశాంతత, శారీరక పటుత్వం, ఆరోగ్యసౌభాగ్య స్థిరత్వాల సాధనకు యోగా క్రియలు నిర్దేషించబడ్డాయని తెలుసుకోవాలి.

ఆరోగ్య పరిరక్షణకు యోగాస్త్రం:

మన ఆరోగ్య పరిరక్షణకు యోగాస్త్రం అత్యంత ప్రభావితంగల వ్యాక్సీన్ వలె పని చేస్తుందని గమనించాలి. మనిషిని చూస్తే మానవ బాంబును చూసినట్లు భయం, గాలి పీల్చితే ఊపిరి ఆగినంత అనుభవం, కరోనా సోకడం కన్న కోవిడ్-19కు భీతిల్లి ప్రాణాలు కోల్పోయేంత పని అయ్యింది. ఇలాంటి కరోనా కల్లోల అకాలంలో దేశ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యానికి, ఉత్తమ వ్యాధి నిరోధక శక్తికి ఏకైక ఉత్తమ మార్గంగా పతంజలి ప్రవేశ పెట్టిన భారతీయ సనాతన ఆధ్యాత్మిక యోగా ప్రాణాయామాలు కరోనా సోకకుండా రక్షక కవచాలుగా పని చేస్తున్నాయని యోగా గురువులు బోధిస్తున్నారు.

శరీరానికి యోగా టీకాస్త్రం:

ఒంటరితనం, భయం, మానసిక ఒత్తిడి లాంటి అవలక్షణాలను ఎదిరించడానికి కావలసిన ఆధ్యాత్మిక 'యోగా టీకాస్త్రం' ప్రయోగించేందుకు ముందుకు రావాలని యోగా సాధకులు కోరుతున్నారు. ఈ క్రమంలో సమత్ వాయు, సింహ క్రియ, షాస్టాంగ, ఇషా క్రియ లాంటి అభ్యాసాలు మనల్ని బలవంతులుగా, ధైర్యస్థులుగా, పాజిటివ్ దృక్పథంతో కరోనా నెగెటివ్ స్థాయికి ఎదుగుతారు. 'యోగాస్త్రం' శరీరానికి ఓ దివ్యఔషధం. యోగా సాధనతో శారీరక మానసిక ధృఢత్వం, ఆక్సీజన్ నిండిన రక్తం, సక్రమ శ్వాస, సమతుల హార్మోన్ల విడుదల, యవ్వన ఛాయ, సమతుల్యతగల కొవ్వు నిల్వలు, కంటి ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెరగడం, సజావుగా జీర్ణక్రియ, శరీరం తేలిక కావడం, ఏకాగ్రత పెరగడం, భావోద్వేగ నియంత్రణ, స్వీయ క్రమశిక్షణ, ధైర్యం పెరగడం, ఆనందంగా జీవించడంల లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. దీని వల్లనే కరోనా లాంటి ఎలాంటి వైరస్‌లు సోకకుండా శరీరం తట్టుకుంటుందని గుర్తు చేస్తున్నారు.

ఆరోగ్య పరిరక్షణ మహోపకరణం:

యోగా సాధన 'జీవన ఆరోగ్య పరిరక్షణకు ఉపకరణం'గా పని చేస్తుంది. అనునిత్యం క్రమం తప్పకుండా యోగా సాధనతో అంతరికశక్తి ఉత్తేజితమై ఎలాంటి వైరస్‌లు సోకకుండా రక్షణ కవచంగా పని చేస్తుంది. వ్యక్తి వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి యోగా శాస్త్ర సాధన ఉపయోగ పడుతుంది. ఉచితంగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న యోగా క్రియల సాధనతో శక్తి ప్రేరణ, ఇమ్యునిటీ, బలం, ప్రాణవాయు శోషణ సామర్థ్యం, మానసిక ఆరోగ్యాలు సిద్ధిస్తున్నాయని నమ్మాలి. కరోనా వ్యాప్తి మానవాళికి మరువలేని గుణపాఠం నేర్పింది. ప్రభుత్వం అందిస్తున్న టీకాలను తీసుకుంటూనే, మన ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు యోగాస్త్రాన్ని వాడుకుంటూ, 'యోగా వీరులు'గా, 'ఆధ్యాత్మిక యోధులు'గా మార్చడానికి ప్రయత్నించాలి. నిర్మలంగా ఉంటూ, సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ముందుకు అడుగులు వేయడమే యోధుల లక్షణం. ఇతరుల ప్రవర్తనను మనం మార్చలేం. మన సత్ప్రవర్తన, అవసర జాగ్రత్తలు మాత్రమే మన చేతుల్లో ఉందని మరువరాదు.

మనసు సంతోష సంద్రంలో తేలియాడినపుడు శారీరక వ్యవస్థలు ఉత్తేజితం అవుతూ, మానసిక బలహీనతలను దూరం చేస్తాయని తెలుసుకోవాలి. స్వీయ నియంత్రణకు యోగా సాధన అతి ముఖ్యమైనదని, ఆవేశాన్ని తుడిచేసి సదాలోచనలను నిలుపుతుందని తెలుసు కోవాలి. కరోనా లాంటి విపత్తుల ప్రతికూల సందర్భాలకు విరుగుడుగా 'ఆధ్యాత్మిక టీకా' లేదా 'యోగాస్త్ర టీకా సురక్ష'ను పొందుదాం, ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

ఓటమి ఇంటర్వెల్ మాత్రమే.. వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి

అమరావతి జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ;: ఈ ఎన్నికల్లో ఓటమి ఇంటర్వెల్ మాత్రమేనని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. కోట్ల మంది ప్రజల్ని కాపాడాల్సిన బాధ్యత మనదేనని, వయసుతో పాటు పోరాడే సత్తా తనకుందన్నారు. వైఎస్ఆర్‌సిపి విస్తృతస్థాయి సమావేశంలో మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడారు. త్వరలోనే ప్రజలకు మరింత దగ్గరయ్యేలా పోరాటాలు చేస్తామని, మనల్ని నమ్ముకొని కొన్ని కోట్ల మంది ఉన్నారని, పార్టీ కార్యకర్తలకు మనం తోడుగా ఉండాలని, ఎన్నడూ లేని విధంగా వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పార్టీ తరఫున ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నామని జగన్ స్పష్టం చేశారు. కేంద్రంలో టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి చక్రం తిప్పుతున్నట్టుగా చూపుతున్నారని, ప్రత్యేకహోదా దిశగా ప్రయత్నించకపోవడం శిశుపాలుడి పాపాల్లో ఒకటి అని, ప్రత్యేక హోదా విషయంలో ఏపి ప్రజలకు బాబు ఏం సమాధానం చెబుతావని ప్రశ్నించారు. శిశుపాలుడిలా బాబు పాపాలు పండుతున్నాయన్నారు. ఎన్నికల్లో న్యాయంగా, ధర్మంగా గెలిచిందు మనమేనన్నారు. నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టే అవకాశమే లేదని జగన్ పేర్కొన్నారు.

రుషికొండ భవనాలు కచ్చితంగా వినియోగిస్తాం:

–మంత్రి వీరాంజనేయస్వామి

ప్రకాశం జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: విశాఖ రుషికొండ పై నిర్మించిన భవనాలను ఎన్డీయే ప్రభుత్వంకచ్చితంగా ఉపయోగించుకుంటుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. భవనాలను ఏ విధంగా ఉపయోగించాలనే దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని మంత్రి చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం మాదిరిగా తాము ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయమన్నారు. సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వం అమరావతిలో ప్రజావేదికను కూల్చివేయడాన్ని గుర్తు చేశారు. అలాంటి పనులు ఎప్పటికీ తమ అధినేత చేయరన్నారు. ప్రభుత్వ డబ్బు వృథా కానివ్వమని, నష్టం కలిగించేలా వ్యవహరించమని వెల్లడించారు. ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యేలు ఆ పార్టీలో నిలబడలేకపోతున్నారని, వారు ఎవరెవరితో టచ్‌లో ఉన్నారనే విషయాన్ని మాత్రం చెప్పనన్నారు.

వ్యక్తిగతంగా, సమాజ శ్రేయస్సును పెంపొందించడంలో యోగా యొక్క ద్వంద్వ పాత్రకు ప్రాధాన్యత

న్యూఢిల్లీ, జూన్ 20 :ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ ఇతివృత్తం 'స్వీయ, సమాజం కోసం యోగా' ను కేంద్ర ఆయుష్ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్ ఉద్ఘాటించారు. వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సును పెంపొందించడంలో యోగా ద్వివిధ పాత్రను ప్రస్తావించారు. యోగ సామాజిక సామరస్యాన్ని పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. "ఇటీవలి కాలంలో లక్షలాది మంది ప్రజలు ఇందులో ఉత్సాహంగా పాల్గొనడం సమాజంపై యోగా విస్తారమైన ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది.'' అని మంత్రి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో యోగా భాగస్వామ్యాన్ని పెంచేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో యోగా వ్యాప్తిని ప్రోత్సహించేందుకు దేశంలోని ప్రతి గ్రామ సర్పంచ్‌లకు ప్రధానమంత్రి లేఖలు రాశారని ఆయన పేర్కొన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన మరోసారి అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శ్రీనగర్‌లో జరగనున్నాయి.

10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఆయుష్ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

యోగాకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారు. 2015 నుంచి ప్రధాన మంత్రి అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను ప్రఖ్యాత ప్రదేశాలైన దిల్లీలోని కర్తవ్య పథ్, చండీగఢ్, డెహ్రాడూన్, రాంచీ, జబల్‌పూర్, న్యూయార్క్ లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయాల్లో పాల్గొన్నారు. ఆయన నాయకత్వం యోగాకు ప్రపంచవ్యాప్త ఆదరణ, గుర్తింపును గణనీయంగా పెంచిందని మంత్రి పేర్కొన్నారు.

సెప్టెంబర్, 2014 లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేసిన ప్రతిపాదన మేరకు ప్రతి ఏటా జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా నిర్వహించాలని ఐరాస 11 డిసెంబర్ 2014 రోజున ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఆయన తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ఇది ముఖ్యమైన దౌత్య విజయంగా పేర్కొన్నారు. ఈ ప్రయత్నం యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడానికి దారితీసింది.

అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా, గత పదేళ్లలో నాలుగు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులను నెలకొల్పింది. 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో కలిసి 35, 985 మంది భారతీయులు రాజ్ పథ్ లో యోగాలో పాల్గొన్నారు. మొత్తం 84 దేశాల్లో భిన్న ప్రాంతాల్లో ఓకేసారి యోగా సెషన్ లో పాల్గొన్నాయి. క్రమంగా ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఈ యోగ వేడుకల్లో పాల్గొనే వారి సంఖ్యలో పెరుగుతోంది. గత ఏడాది 2023 లో, ప్రపంచవ్యాప్తంగా మొత్తం 23.4 కోట్ల మంది యోగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కంటి చూపు లేని వారి కోసం సౌకర్యవంతంగా యోగా నేర్చుకునేందుకు, అభ్యసించడానికి ఆయుష్ మంత్రి 'కామన్ యోగా ప్రోటోకాల్ బుక్ ఇన్ బ్రెయిలీ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యోగాపై ప్రొఫెసర్ ఆయుష్మాన్ కామిక్ పుస్తకాన్నిఆవిష్కరించారు. "ఈ పుస్తకం పిల్లల్లో ఆసక్తిని పెంపొందిస్తూ, వినోదంతో యోగా నేర్చుకోవడానికి, అభ్యసించడానికి సహాయపడుతుంది" అని మంత్రి పేర్కొన్నారు.

2024 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ ఏడాది 'యోగా ఫర్ స్పేస్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కామన్ యోగా ప్రోటోకాల్ మార్గదర్శకాల ప్రకారం ఇస్రో శాస్త్రవేత్తలు, అధికారులందరూ కలిసి యోగా చేయనున్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టు బృందం కూడా ఈ యోగా సాధన చేయడం ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క ప్రపంచవ్యాప్త ప్రచారంలో పాల్గొంటుంది.

యోగా రంగంలో సాంకేతికతను, అంకుర సంస్థలను ప్రోత్సహించడానికి, ఆయుష్ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వానికి చెందిన మైగవ్ పోర్టల్, మైభారత్ పోర్టల్‌లో 'యోగా టెక్ ఛాలెంజ్'ను నిర్వహిస్తోంది. ఇది యోగా సంబంధిత సాధనాలు, సాఫ్ట్ వేర్, అనుబంధ ఉపకరణాలను అభివృద్ధి చేసిన అంకుర సంస్థలను, వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడం కోసం నిర్వహిస్తున్నారు.

ఆయుష్ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా, అంతర్జాతీయ యోగ దినోత్సవం ప్రారంభమైనప్పటి నుండి దాని ప్రయాణాన్ని ప్రస్తావించారు. ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో, సామాజిక విలువలను పెంపొందించడంలో, సమాజ భావనను ప్రజల్లో కలిగించడంలో యోగ పాత్రను వివరించారు. యోగా మనస్సు, శరీరాల ఐక్యతను పెంపొందిస్తుందని, సమతుల్యత, స్వీయ నియంత్రణ, సంపూర్ణ వికాసాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో వర్చువల్ వేడుకలను ఆయన గుర్తు చేశారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా పాత్రను ఆయన ప్రధానంగా తెలిపారు.

ఆయుష్ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సంపూర్ణ ప్రభుత్వ' విధానాన్ని ఆయన ప్రస్తావించారు. వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో చేస్తున్న కృషిని, ప్రతి సంవత్సరం సమ్మిళిత, విస్తృత కార్యాచరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాల క్రియాశీలక భాగస్వామ్యాన్ని ఉద్ఘాటించారు. ఐడీవై 2024లో రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా చురుగ్గా పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా జాతీయ ఆయుష్ మిషన్ బృందం కూడా ఐడీవై కార్యక్రమాల నిర్వహణలో క్రియాశీలకంగా పాల్గొంటోంది. ఈ సహకార ప్రయత్నం సమాజంలోని అన్ని రంగాలలో సంపూర్ణ ఆరోగ్యాన్ని, శ్రేయస్సును ప్రోత్సహించడంలో యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.

ఆయుష్ మంత్రిత్వ శాఖ, దిల్లీలోని ఎన్‌డిఎంసి (న్యూఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్), ఎఎస్ఐ (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) డిడిఎ (ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ)తో కలిసి 21 జూన్ 2024 న సామూహిక యోగా కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. బ్రహ్మ కుమారీస్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, పతంజలి, గాయత్రి పరివార్, ఈషా యోగా సెంటర్, హార్ట్ ఫుల్‌నెస్ వంటి సామాజిక సంస్థల నుంచి కూడా మంత్రిత్వ శాఖకు అపారమైన మద్దతు లభిస్తోంది.

ఆయుష్ మంత్రిత్వ శాఖ, యోగ దినోత్సవ కార్యక్రమాల్లో ప్రజలందరిని భాగస్వామ్యం చేసేందుకు, అనేక పోటీలను, కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్) భాగస్వామ్యంతో, మైగవ్ మైభారత్ పోర్టల్స్ లో నిర్వహించిన "యోగా విత్ ఫ్యామిలీ" వీడియో కాంటెస్ట్ ఇందులో ఒక ప్రధా కార్యక్రమం. ఈ పోటీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుటుంబాలను ఐడీవై 2024 వేడుకలలో పాల్గొనడానికి ప్రోత్సహిస్తుంది. దీని ద్వారా కుటుంబ బంధాలను బలోపేతం చేస్తుంది. ఇందులో పాల్గొనేందుకు చివరి తేదీ 30 జూన్ 2024

నెల్లూరులో అగ్ని ప్రమాదం.. బాలిక సజీవదహనం..

–పేలిన ఆరు సిలిండర్లు
–కట్టుబట్టలతో 14 కుటుంబాలు రోడ్డు పాలు
–చలించిన మంత్రి నారాయణ
–ఒక్కొక్క కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం
–తక్షణ సాయం చర్యల్లో కలెక్టర్ హరినారాయణ్

అమరావతి, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): నెల్లూరు సిటీలోని బర్మాస్టాల్ గుంటలో భారీ అగ్నిప్రమాదం కలచివేసింది. గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు రేగాయి. ఈ ప్రమాదంలో ఆరు గ్యాస్ సిలిండర్లు పేలిపోగా.. నాలుగు ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. దుర్ఘటనలో నాగలక్ష్మి (12) అనేక బాలిక దుర్మరణం చెందింది.

అకస్మాత్తుగా భీకర శబ్దంతో సిలిండర్లు పేలటంతో జనం బీతావహులయ్యారు. ఇళ్లల్లోంచి బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటన స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఘోరం జరిగిపోయింది. ఇంటిలోని 12 ఏళ్ల బాలిక సజీవ దహనమైంది.. పెద్ద ఎత్తున పొగలు.. అగ్ని కీలలు వ్యాపించాయి. బాధితులు హాహాకారాలతో బర్మా షెల్ గుంట మార్మోగిపోయింది.

చలించిన మంత్రి నారాయణ ..

ఈ సమాచారంతో టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ప్రమాద స్థలికి చేరుకున్నారు. మరోవైపు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పందించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ. 15వేలు తక్షణ సాయం ప్రకటించారు. మొత్తం 14 కుటుంబాలు ఈ అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయాయి. కట్టుబట్టలతో ఈ కుటుంబాలు రోడ్డు పాలయ్యాయి. ఈ కుటుంబాలన్నీ నిరుపేద కుటుంబాలే. బాధిత కుటుంబాలకు మంత్రి నారాయణ పంపించిన నగదును అబ్దుల్ అజీజ్ అందజేశారు. మరోవైపు తక్షణ సహాయక చర్యలను కలెక్టర్ హరి నారాయణన్ పర్యవేక్షించారు. మృతి చెందిన బాధితురాలు కుటుంబాన్ని పరామర్శించారు.

గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకుంటున్నారు

–టిడిపి, జనసేన నాయకులపై రోజా సెటైర్స్

అమరావతి జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్ఆర్‌సిపి ఘోర ఓటమిని చవి చూసింది. దీంతో వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరిపితే బాగుంటుందని ట్వీట్ చేశారు. అభివృద్ధి చెందిన దేశాలు ఎన్నికలలో పేపర్ బ్యాలెట్‌ను వాడుతున్నాయని చెప్పారు. దీంతో మాజీ మంత్రి రోజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమికి అన్ని సీట్లు రావడం గురించి చిన్న పిల్లాడిని అడిగిన చెబుతారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబం తన కుటుంబంగా భావించి సంక్షేమ పథకాలు అందించామని, పేదరిక నిర్మూలన ధ్యేయంగా పని చేశామని, ఎపిని అని విధాలుగా అభివృద్ధి చేసిన 11 నీట్లు రావడం ఏంటని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో 40 శాతం ఓట్లతో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, లోక్ సభ ఎన్నికలలో 40 శాతం ఓట్లతో నరేంద్ర మోడీ ప్రధాని అయ్యారన్నారు. జగన్‌కు 40 శాతం ఓట్లు వస్తే 11 సీట్లు ఏలా వస్తాయని రోజా అడిగారు. గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే టిడిపి, జనసేన నాయకులు భుజాలు తడుముకుంటున్నారని మండిపడ్డారు.

చిన్న పరిశ్రమలకు రాయితీ ఇస్తాం- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): చిన్న పరిశ్రమలకు రాయితీలు అందిస్తామని ప్రకటించారు రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. ఈ రోజు సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో మంత్రిగా బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు.

ఏంఎస్ఏంఈ, సెర్ప్, ఎన్నారై విభాగం ఈ మూడు విభాగాలు అనుసంధానం చేసి ఒక ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి తనకు అప్పగించారన్నారు.. చిన్న పరిశ్రమల ద్వారా ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. నూతన పారిశ్రామిక వేత్తలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తానని చెప్పారు. స్కిల్ డెవలప్మెంట్ కోసం ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉందన్నారు.. గత ప్రభుత్వంలో చిన్న పరిశ్రమల కు ఎదురైనా సమస్యలు పరిష్కరిస్తామని, బకాయి ఉన్న రాయితీలు త్వరలో అందజేస్తామని పేర్కొన్నారు .

అలయాల భూములను కాపాడతాం - మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

అమరావతి, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): ఆలయాలకు సంబంధించిన ప్రతి సెంటు భూమి కాపాడేలా చర్యలు తీసుకుంటామని,.. ఆక్రమణకు గురైన ప్రతి సెంటు భూమి తిరిగి దేవదాయ శాఖ ఇప్పించే విధంగా చర్యలు చేపడతామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. విజయవాడలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఏపీ దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నేటి నుంచి పూర్తిగా శాఖ పైన అన్ని రకాల చర్యలు, నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు..

ఇక, 3వ తేదీ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో తమ కార్యాలయంలో పూర్తిస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తాం అన్నారు మంత్రి ఆనం.. ధర్మాన్ని మనం కాపాడితే.. అదే మనల్ని, ప్రజల్ని కాపాడుతుందన్న ఆయన.. ఆలయాల నిర్వహణ పట్ల గతంలో అనేక కథనాలు వచ్చాయి. ప్రభుత్వం సరిచేసుకొని వెళ్లాలని, మొదటిసారి జరిగితే దాన్ని తప్పు రెండోసారి జరిగిన స్వయంకృత అపరాధం కింద పరిగణిస్తాం న్నారు. దేవాలయాల ప్రక్షాళన మొట్టమొదట తిరుమల తిరుపతి దేవస్థానం నుండి ప్రారంభిస్తున్నామన్నారు.. తమ అభిప్రాయాలు ప్రజల ముందు ఉంచారు.. త్రిదండి చిన్న జీయర్ స్వామిని కలిసి సలహాలు ఇవ్వాలని కోరానన్నారు.. అందరూ పీఠాధిపతులు, మతాధి వతులను కలిసి వారి ఆశీస్సులు తీసుకొని వారి సూచనలు సలహాలు తీసుకోవడం జరిగిందన్నారు.. 26 వేలకు పైగా ఆలయాలకు పాలకవర్గాలు, ఆస్తులు ఉన్నాయని, .. కానీ, దీపం పెట్టే పరిస్థితి లేదన్నారు. ధూప దీప నైవేద్యం కోసం కార్యక్రమం తీసుకుంటామన్నారు.. భవిష్యత్తులో అన్ని కార్యక్రమాలు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసి.. అన్ని కార్యక్రమాలు సజావుగా నిర్వహిస్తాం అన్నారు.

దేవాలయాల అభివృద్ధి పునరుద్ధరణ వంటి విషయాలు పూర్తి స్థాయిలో పర్యవేక్షించిన తరువాతే అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు ఆనం రామనారాయణరెడ్డి.. ఆలయాల కమిటీ కాలపరిమితి ప్రకారం కొత్త వాటి నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు.. తిరుమల నుంచే ప్రక్షాళన చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు.. ఈవోగా శ్యామలరావును నియమించారని గుర్తు చేశారు .. అన్ని ఆలయాల్లో పవిత్రత నిలబడేలా, చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

శ్రీవారి మెట్టు నడక మార్గంలో స్కాన్ చేసిన టోకెన్లు ఉంటేనే శ్రీవారి దర్శనం.

తిరుపతి, జూన్ 19 : శ్రీవారి మెట్టు మార్గంలో 1200వ మెట్టు వద్ద దివ్య దర్శనం టోకెన్ స్కానింగ్‌ను టీటీడీ పునఃప్రారంభించింది

. ఇందుకు సంబంధించిన ట్రయల్ రన్ గురువారం నిర్వహించారు. శ్రీవారి మెట్టు వద్ద దివ్య దర్శనం టోకెన్లు తీసుకున్న భక్తులు శుక్రవారం నుండి విధిగా 1200వ మెట్టు వద్ద స్కానింగ్ చేయించుకోవాలి.

లేకుంటే గతంలో ఆచరణలో ఉన్నట్లుగా దివ్య దర్శనం టోకెన్లు కలిగి స్కాన్ చేసుకొని భక్తులను దర్శన క్యూ లైన్లలో అనుమతించరు. కావున భక్తులు ఈ మార్పును గమనించి తదనుగుణంగా దర్శనానికి రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

బీహార్‌లో బిసి, ఈబిసి, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల కోటాను కొట్టేసిన హైకోర్టు

పాట్నా జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బీహార్ లో బిసి, ఈబిసి, ఎస్సీ, ఎస్టీలకు 65 శాతం రిజర్వేషన్ల కోటాను పాట్నా హైకోర్టు గురువారం కొట్టేసింది.ఆర్టికల్స్ 14, 15,16 కింద సమానత్వ క్లాజ్ కు విరుద్ధంగా ఉన్నందున బీహార్ రిజర్వేషన్ చట్టం2 023 చట్టంను పక్కన పెట్టేసింది. బీహార్ 2023లో తీసుకొచ్చిన శాసనం బిసి, ఈబిసి, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచేందుకు ఉద్దేశించింది. ఈ చట్టంతో బీహార్లో రిజర్వేషన్లు మొత్తం 75 శాతానికి చేరుకుంటాయి. దీంతో రిజర్వేషన్లు ఇచ్చే అతి పెద్ద రాష్ట్రంగా బీహార్ అయ్యేది. కానీ కోర్టు ఈ చట్టం ప్రతిపాదనను ఆమోదించలేదు.ప్రస్తుతానికి రిజర్వేషన్ల కోటా పరిమితి 50 శాతం మేరకే ఉంది. దానికి మించి రిజర్వేషన్లు కల్పించే చట్టాలను కోర్టులు తిరస్కరిస్తున్నాయి.


మీరా సంగీత మండలి, హన్మకొండ

పియంశ్రీ నిధులు రూ.13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి శంఖుస్థాపన

నిర్మల్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నిర్మల్ జిల్లా సోన్ మండలం లెఫ్టే పోచంపాడు గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ & కాలేజీ లో కేంద్ర ప్రభుత్వ పియంశ్రీ నిధులు రూ. 13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ నూతన భవన నిర్మాణానికి,మరియు నిర్మల్ రూరల్ మండలం డ్యాంగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ పియంశ్రీ నిధు లు13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ నూ తన భవన నిర్మాణ పనులకు శంఖు స్థాపన చేసిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు. ఈ కార్యక్ర మంలో విద్యాశాఖ అధికారులు, బీజేపీ నాయకులు సత్యనారాయణ గౌడ్, ఎంపీపీ బర్ల మానస హరీష్ రెడ్డి, మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, ఎంపీటీసీ , బీజేపీ నాయకులు మార గంగారెడ్డి, జమాల్, తో పాటు పాల్గొన్నారు.

రూ.100 కోట్ల ముడుపులు డిమాండ్ చేసిన కేజ్రీవాల్

–మా వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయి
–రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపిన ఇడి

న్యూఢిల్లీ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : లిక్కర్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రూ. 100 కోట్ల ముడుపులను డిమాండ్ చేసినట్లుగా తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) బుధవారం రౌస్ అవెన్యూ కోర్టుకు తెలియచేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇడి తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదనలు వినిపిస్తూ ఈ కేసులో మనీ లాండరింగ్ జరిగిందన్న ఆరోపణలపై ఇడి దాఖలు చేసిన చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ఇదే కేసులో సహ నిందితుడైన ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించడం మనీ లాండరింగ్ ఆరోపణలను ఆమోదించినట్లేనని ఆయన తెలిపారు.ఈ కేసులో మనీ లాంరింగ్ జరిగినట్లు ఇడి దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నాయని సంతృప్తి చెందినట్లేనని ఆయన చెప్పారు. రూ. 100 కోట్ల ముడుపులను కేజ్రీవాల్ డిమాండ్ చేసినట్లు సిబిఐ దర్యాప్తులో వెల్లడైందని ఇడి తెలిపింది. కేజ్రీవాల్ అరెస్టుకు ముందే సాక్ష్యాలను తాము సేకరించామని ఎఎస్‌జి రాజు కోర్టుకు తెలిపారు. కాగా..కేజ్రీవాల్ తరఫున న్యాయవాది విక్రమ్ చౌదరి తన వాదనలు వినిపిస్తూ ఏ చార్జిషీట్‌లోను కేజ్రీవాల్ పేరును ప్రస్తావించలేదని తెలిపారు. సిబిఐ నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లో కూడా కేజ్రీవాల్‌ను నిందితుడిగా పేర్కొనలేదని ఆయన తెలిపారు. ఇడి చేస్తున్న ఆరోపణలన్నీ పిఎంఎల్‌ఎ కింద కాకుండా సిబిఐ కేసులో వాదనలు వినిపిస్తున్నట్లు ఉందని ఆయన తెలిపారు.మే 10న సుప్రీంకోర్టు తన ఉత్తర్వులలో దిగువ కోర్టులో కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని పేర్కొందని న్యాయవాది తెలిపారు. బెయిల్ ఇప్పిస్తామన్న హామీతో ఇదివరకు అరెస్టు చేసిన సాక్షుల వాంగ్మూలాల ఆధారంగానే మొత్తం కేసు నడుస్తోందని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. క్షమాభిక్ష పెడతామని ప్రలోభ పెట్టి సాక్షం చెప్పించారని, సాక్షం ఇచ్చిన వారి విశ్వసనీయతను సవాలు చేస్తున్నామని న్యాయవాది చెప్పారు. 2022 ఆగస్టులో ఈ కేసు పురుడుపోసుకోగా 2024 మార్చిలో కేజ్రీవాల్ అరెస్టు జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం దీని వెనుక గల దురుద్దేశాన్ని తెలియచేస్తోందని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా కేజ్రీవాల్ జుడిషియల్ కస్టడీని కోర్టు జులై 3వ తేదీ వరకు పొగించింది.

2024-25 ఆర్థిక సంవత్సరానికి స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 22.19% వృద్ధి

న్యూఢిల్లీ, జూన్ 20 :2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్ను నికర వసూలు రూ. 4,62,664 కోట్లుగా(ప్రాథమిక అంచనా) నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2023-24) ఇదే కాలానికి నమోదైన రూ.3,82,414 కోట్లతో పోలిస్తే 20.99 శాతం వృద్ధి కనబరిచింది.

ఈ రూ.4,62,664 కోట్లు(17.06.2024 నాటికి) నికర ప్రత్యక్ష పన్నులో....రూ.1,80,949 కోట్లు (నికర రీఫండ్) కార్పొరేషన్ ట్యాక్స్ (సీఐటీ) కాగా, రూ.2,81,013 కోట్లు(నికర రీఫండ్) సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) సహా వ్యక్తిగత ఆదాయపు పన్ను (పీఐటీ)

ప్రాథమిక అంచనాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్నుల స్థూల వసూళ్లు (రీఫండ్లకు సర్దుబాటు చేయడానికి ముందు) అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నమోదైన రూ.4,22,295 కోట్లతో పోల్చితే 22.19 శాతం వృద్ధితో రూ.5,15,986 కోట్లకు చేరుకున్నాయి.

ఈ ప్రత్యక్ష పన్నుల స్థూల వసూళ్లు రూ.5,15,986 కోట్లలో... కార్పొరేషన్ ట్యాక్స్ (సీఐటీ) రూ.2,26,280 కోట్లు, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) సహా వ్యక్తిగత ఆదాయపు పన్ను (పీఐటీ) రూ.2,88,993 కోట్లుగా ఉన్నాయి. రూ.1,48,823 కోట్ల అడ్వాన్స్ ట్యాక్స్ , రూ.3,24,787 కోట్ల టీడీఎస్(ట్యాక్స్ డిడిక్షన్ ఎట్ సోర్స్), రూ.28,471 కోట్ల సెల్ఫ్ అసెస్మెంట్ ట్యాక్స్, రూ.10,920 కోట్ల రెగ్యులర్ అసెస్మెంట్ ట్యాక్స్‌లు మైనర్ హెడ్ వైజ్ వసూళ్లలో ఉన్నాయి. ఇతర చిన్న పద్దుల కింద రూ.2,985 కోట్లు ఉన్నాయి.

2024-25 ఆర్థిక సంవత్సరానికి (17.06.2024 నాటికి) మొత్తం అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు(ప్రాథమిక గణాంకాల ప్రకారం) రూ.1,48,823 కోట్లు కాగా, అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (అంటే 2023-24 ఆర్థిక సంవత్సరం) ఇదే కాలానికి సంబంధించిన వసూళ్లు రూ.1,16,875 కోట్లతో పోల్చితే 27.3 శాతం వృద్ధి నమోదైంది. రూ.1,48,823 కోట్ల అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లలో.. కార్పొరేషన్ ట్యాక్స్ (సీఐటీ) రూ.1,14,353 కోట్లకాగా, వ్యక్తిగత ఆదాయపు పన్ను (పీఐటీ) రూ.34,470 కోట్లుగా ఉంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో 17.06.2024 వరకు రూ.53,322 కోట్ల రిఫండ్లు జారీ అయ్యాయి. ఇది అంతకు ముందు ఏడాది ఇదే కాలానికి సంబంధించిన రీఫండ్లతో పోలిస్తే 33.70% ఎక్కువ.

భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలో సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలను చేపట్టిన శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ

న్యూఢిల్లీ, జూన్ 20 :శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ లో సహాయ మంత్రి గా పదవీ బాధ్యతల ను ఉద్యోగ్ భవన్ లో ఈ రోజు స్వీకరించారు.

భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ కామ్ రాన్ రిజ్ వీ ఆ శాఖ లోని సీనియర్ అధికారుల తో కలసి మంత్రి కి స్వాగతం పలికారు.

శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ ఆంధ్ర ప్రదేశ్ లోని నరసాపురం లోక్ సభ నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యుని గా ఎన్నికయ్యారు.

అప్పులు చేసి సంపద సృష్టిస్తాం

–ఆ సంపద ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తాం
– డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అప్పులు చేసి సంపద సృష్టిస్తామని,ఆ సంపద ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.బుదవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఐదు సంవత్సరాలలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తాం పార్టీలో కష్టపడి పనిచేసిన వారి సమాచారం అధిష్టానం వద్ద సమగ్రంగా ఉంది.. త్వరలోనే పనిచేసిన వారికి పదవులు అందుతాయన్నారు. రైతు రుణమాఫీకి పూర్తిగా మా ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎవరికి ఎలాంటి అనుమానాలు అవసరం లేదు దేశంలో అధికారం లో ఉన్న బిజెపి కుల గణనా చేపట్టాలి తద్వారా దేశ సంపద వనరులు పంచబడాలి. పాలనలోను భాగస్వాములను చేయాలని మా డిమాండ్ అని తెలిపారు.మేడిగడ్డలో మేట వేసిన ఇసుకను తొలగిస్తేనే మరమ్మతు పనులు ప్రారంభమవుతాయి కేంద్ర బడ్జెట్ ఆధారంగా రాష్ట్ర బడ్జెట్టు ప్రవేశపెడతాం విద్యుత్ కొనుగోళ్లపై న్యాయ విచారణ జరగాలని నిండు సభలో వాటి విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి కోరారు.. న్యాయ విచారణ అంటే వారు ఎందుకు ఆందోళన చెందుతున్నారు అర్థం కావడం లేదన్నారు. ఈదేశ సంపద వనరులు దామాషా ప్రకారం పంచబడాలని రాహుల్ గాంధీ సుదీర్ఘ పాదయాత్ర చేశారు.. జనాభా దామాషా ప్రకారం సంపద పదవులు పంచాలని ఆయన ఎన్నికల ముందు కోరారు.. తెలంగాణ రాష్ట్రంలో రాహుల్ ఆలోచనలు అమలు చేస్తున్నాం. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తున్నాము వారి ఆలోచనలు ఆశయాలను ముందుకు తీసుకువెళ్తాం. దేశంలో కులగనను జరగాలని రాజీవ్ గాంధీ ఇచ్చిన పిలుపు విప్లవాత్మకమైనది

నలంద ఒక పేరు మాత్రమే కాదని, అది ఒక గుర్తింపు

– గ్రంథాలను కాల్చవచ్చు జ్ఞానాన్ని కాదు
–నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ

పాట్నా జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నలంద ఒక పేరు మాత్రమే కాదని, అది ఒక గుర్తింపు, ఒక గౌరవమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. బీహార్‌లోని నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నలంద ఒక అమూల్యమైన పందని, అది ఒక మంత్రమని ఆయన చెప్పారు. పుస్తకాలను అగ్ని ఆహుతి చేయవచ్చు నేమోకాని జ్ఞానాన్ని చెరిపివేయలేవని ప్రధాని అన్నారు. మూడవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి బీహార్‌ను సందర్శించిన ప్రధాని మోడీ నలంద విశ్వవిద్యాలయంలో గతంలో చవిచూసిన పోరాటాలను గుర్తు చేశారు. నలందను ఒక రుషిగా ఆయన అభివర్ణించారు. నలంద విశ్వవిద్యాలయం చరిత్ర ఒక్క భారతదేశానికే పరిమితం కాదని, అది ఆసియా ఖండానికే చెందినదని మోడీ అన్నారు.విశ్వవిద్యాలయం పునర్నిర్మాణంలో మన పొరుగుదేశాలు కూడా పాల్గొన్నాయని ఆయన వెల్లడించారు. ఇది వసుధైక కుటుంబం స్ఫూర్తిగా ఆయన పేర్కొంటూ ప్రపంచ నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడకు వస్తున్నారని, 20 దేశాలకు పైగా విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారని ప్రధాని తెలిపారు. అంతకుముందు ఆయన నలంద విశ్వవిద్యాలయానికి చెందిన శిథిలాలను సందర్శించారు. వీటిని 2016లో యునెస్కో వారసత్వ సంపదగా ప్రకటించింది. భారతదేశ గత వైభవ చిహ్నమైన నలంద విశ్వవిద్యాలయాన్ని ప్రధాని కీర్తిస్తూ ప్రపంచ దేశాలకు చెందిన యువజనుల వ్యిపరమైన అవసరాలను ఈ విశ్వవిద్యాలయం తీర్చగలదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. మన విద్యా రంగంలో నేడు ఒక ప్రత్యేక సుదినమని ఎక్స్ వేదికగా ప్రధాని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నలంద విశ్వవిద్యాలయానికి చెందిన నూతన క్యాంపస్‌ను రాజ్‌గిర్ వద్ద ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ నెల 25న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కానున్నాయి. గత పరీక్షల మూల్యాంకనంలో తప్పులు జరిగిన నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం డీకోడింగ్, ఆన్‌లైన్‌లో మార్కుల ఎంట్రీ పూర్తైంది. ఈ నెల 25న ఫలితాలు విడుదల కానున్నట్లు తెలుస్తోంది.ఏవైనా అనివార్య పరిస్థితులు ఏర్పడితే ఈ నెల 26 లేదా 27న విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు, ఫస్టియర్ ఇంప్రూవ్‌మెంట్ కోసం రాసిన వారు దాదాపు 4.5 లక్షల మంది ఉన్నారు. కాగా, తెలంగాణలో మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

పోలీసులతో తన భద్రతకు ముప్పు ఉంది: బెంగాల్ గవర్నర్

కోల్ కతా జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పోలీసులతో తన భద్రతకు ముప్పు ఉందని బెంగాల్ గవర్నర్ సి.వి. ఆనంద బోస్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

'ప్రస్తుతం విధుల్లో ఉన్న ఇన్ ఛార్జీ అధికారి, ఆయన టీమ్ వల్ల నా భద్రతకు ముప్పు ఉంది. ఇప్పటికే నేను ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సమాచారం ఇచ్చాను. కానీ ఇంత వరకు చర్యలు లేవు" అని ఆందోళన వ్యక్తం చేశారు

కాంగ్రెస్‌వి గుంటనక్క వేషాలు.. కుట్రల రాజకీయాలు

–దింపుడు కల్లం ఆశలు వదులుకోవాలి
–బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎన్వీ సుభాష్

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కాంగ్రెస్ వి గుంటనక్క వేషాలు.. ఆ పార్టీ నాయకులవి ఎప్పుడూ కుట్రల రాజకీయాలేనని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్వీ సుభాష్ విమర్శించారు.ఎన్‌డిఏ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, ఇండీ కూటమి అధికారంలోకి వస్తుందంటూ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే.. అధికార పైత్యం ఎంత పట్టుకుందో ఇట్టే అర్థమవుతోంది.దేశంలో ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తోకపార్టీలతో పొత్తుపెట్టుకుని ముక్కీమూలిగి వందసీట్లు మాత్రమే సాధించింది.ఎన్డీయే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలుపన్నడం చూస్తుంటే కాంగ్రెస్ వి నీచ రాజకీయాలని మరోసారి రుజువైందన్నారు..అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని తెలంగాణ రాష్ట్రంలో 6 గ్యారంటీల పేరుతో గారడీలు చేసి 400 పైగా హామీలతో 420 వేషాలకు తెరదీసింది.వందరోజుల్లో హామీల అమలు చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక ప్రజలను మరోసారి మోసం చేసింది. ఆరు నెలల్లోనూ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకున్న కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎప్పుడు అధ:పాతాళంలోకి పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు..తెలంగాణలో ప్రజలకు ఒరగబెట్టింది లేదు కాని.. ఎన్డీయే ప్రభుత్వాన్ని కూలదోసి దేశాన్ని ఉద్ధరిస్తామని చెప్పడం సిగ్గుచేటు.వికసిత్ భారత్ లక్ష్యంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం కృషి చేస్తుంటే.. 'విభజన భారత్' కోసం కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఎన్వీ సుభాష్ దుయ్యబట్టారు..కాంగ్రెస్ పార్టీ కథ కంచికి చేరిందని మొన్నటి లోక్ సభ ఎన్నికల ద్వారా మరోసారి రుజువైంది.వరసగా 2014, 2019 ఎన్నికల్లో రెండు అంకెల సంఖ్యకే పార్టీ బలం పరిమితమయింది. ఒకసారి సోనియా గాంధీ నాయకత్వంలో, మరోమారు రాహుల్ గాంధీ సారథ్యం లో శతాధిక సంవత్సరాల పార్టీ చచ్చు బడిపోయింది. ఇప్పుడు మూడవసారి మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో అదే పునరావృతమైంది.బాధ్యతలు లేని అధికారాన్ని చెలాయించేం దుకు అలవాటు పడిన రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ బతికి బట్ట కట్టడం కాదు కదా, ఐసీయూ నుంచి బయటకు రావడం కూడా జరిగే పని కాదన్నారు..గడిచిన 23 సంవత్సరాలలో ఒక్క సెలవు కూడా తీసుకోకుండా దేశం కోసం పనిచేసిన వారు నరేంద్ర మోదీ. ఓటమి దెబ్బలు తిని బ్యాంకాక్ కు నెలల తరబడి పారిపోయి కాడి ఎత్తేయడం రాహుల్ గాంధీకి అలవాటు. ఇండీ కూటమి అవినీతిపరులుకు చిరునామా. కుటుంబ పాలకుల అడ్డా. మెజారిటీ ప్రజల మనోభావాలను నిరంతరం కించపరిచే ప్రజాస్వామ్య ద్వేషుల కూటమి. వీరికి కూడా రాహుల్ మీద నమ్మకం లేదు.మోదీ స్థానంలో రాహుల్‌ను నిలబెట్టే దింపుడు కల్లం ఆశలు చెల్లవని గుర్తుంచుకోవాలని ఎన్వీ సుభాష్ హెచ్చరించారు..2024 ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూసినా బుద్ధిరాని ఇండీ కూటమి బీజేపీ, ఎన్డీఏ సంఖ్యా బలాన్ని తగ్గించేందుకు, తద్వారా తమ ఉనికిని కాపాడు కునేందుకు కుట్రలు మొదలుపెట్టడం నీచ రాజకీయానికి పరాకాష్ఠే.ఊదు కాలదు.. పీరు లేవదు.. దేశంలో భవిష్యత్తులోనూ కాంగ్రెస్ గెలిచేది లేదు.. రాహుల్ బాబా ప్రధాని అయ్యేది లేదని ఎన్వీ సుభాష్ ఎద్దేవా చేసారు.

రాహుల్ గాంధీ జన్మ దినోత్సవం సందర్భంగా రక్త దానం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాహుల్ గాంధీ జన్మ దినోత్సవం సందర్భంగా గాంధీ భవన్ లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ సేనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రక్త దాన శిబిరంలో రక్త దానం చేస్తున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనా రెడ్డి, చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నారు.

సురక్షిత్ భారత్ ఇనిషియేటివ్ కింద 45వ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్స్ డీప్ డైవ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోన్న ఎన్ఈజీడీ

న్యూఢిల్లీ, జూన్ 20 :పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కోవటానికి తగిన భద్రతా చర్యలను నిర్ధారించుకునేందుకు, తమ డిజిటల్ మౌలిక సదుపాయాలను సంస్థలు రక్షించుకునేందుకు, భవిష్యత్ సైబర్ దాడుల విషయంలో సిద్ధంగా ఉండేందుకు, సైబర్ నేరాలపై అవగాహన పెంచే విషయంలో చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్స్(సీఎస్ఐఓ)కు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఫ్రంట్‌లైన్ ఐటీ అధికారులకు సామర్థ్యాల నిర్మాణం(కెపాసిటీ బిల్డింగ్) లక్ష్యంగా 'సైబర్ సురక్షిత్ భారత్' ఇనిషియేటివ్‌ను ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ తీసుకొచ్చింది.

నేషనల్ ఇ-గవర్నెన్స్ డివిజన్ (ఎన్ఈడీజీ) తన కెపాసిటీ బిల్డింగ్ స్కీమ్ కింద 2024 జూన్ 18 నుంచి 22 వరకు 45 వ సీఐఎస్ఓ డీప్-డైవ్ శిక్షణ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని అడ్మిని స్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కి) లో నిర్వహిస్తోంది. ఇందులో గుజరాత్, హర్యానా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, న్యూఢిల్లీ, రాజస్థాన్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఈఐటీవై, ఎన్ఈజీడీ, ఆస్కీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సైబర్ దాడులను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి, సైబర్ భద్రత విషయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి.. ఈన్ఫ్రాస్ట్రక్చర్ ప్రయోజనాలను సంస్థలు, పౌరులకు అందించే విషయంలో సీఐఎస్ఓలకు అవగాహనతో పాటు వీలు కల్పించడం ఈ డీప్-డైవ్ శిక్షణ కార్యక్రమం లక్ష్యం. చట్టపరమైన నిబంధనలపై సమగ్ర దృక్పథాన్ని అందించడం, సైబర్ సెక్యూరిటీ రంగంలో విధానాలను రూపొందించడానికి సీఐఎస్‌వోలకు వీలు కల్పించడం, పటిష్టమైన సైబర్ సంక్షోభ నిర్వహణ ప్రణాళికలను రూపొందించడంపై ఈ శిక్షణ కార్యక్రమం దృష్టి సారించింది.

అవగాహనను పెంచటం, సామర్థ్యాలను పెంచడం, బలమైన సైబర్ వ్యవస్థను సృష్టించడానికి ప్రభుత్వ విభాగాలు చర్యలు తీసుకునేలా చేయడం ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం జరుగుతోంది. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సైబర్ భద్రత, రక్షణ విషయంలో నునితత్వం తెలియజేయటంతో పాటు అవగాహన కల్పించి, తద్వారా పౌరులకు వివిధ ప్రభుత్వ సేవలను సమగ్రంగా అందించడానికి డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని ఉపయోగించుకోవటం అనే ప్రయత్నంతో ఈ కార్యక్రమం సాగుతోంది. సైబర్ అంశాల విషయంలో శుభ్రత, భద్రత, రక్షణను ప్రభుత్వ విభాగాలు చూసుకోవడానికి వీలుగా సైబర్ భద్రత గురించి సమగ్ర సమాచారం, పరిజ్ఞానాన్ని కూడా ఈ కార్యక్రమం అందిస్తుంది.

2018లో సీఐఎస్‌వో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో ప్రభుత్వం, పరిశ్రమల కన్సార్టియం ఇది విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఎన్ఈడీజీ 45 సీఐఎస్ఓ డీప్-డైవ్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. ఇది 1,662 మందికి పైగా సీఐఎస్ఓలు, ముందు వరుస ఐటీ అధికారులకు ప్రయోజనం చేకూర్చింది. అంతేకాకుండా సైబర్ భద్రతా రంగంలో గణనీయమైన ప్రభావాన్ని చూపించింది.

టీచర్ల పదోన్నతుల బదిలీ ఉత్తర్వుల జాప్యం.. ఉపాధ్యాయుల నిరసన

ఆదిలాబాద్, జూన్ 20 ::ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీ ఉత్తర్వులపై విద్యాశాఖ ఎడతెగని జాప్యం చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆదిలాబాద్ డీఈవో కార్యాలయం ఎదుట భాషా పండితులు నిరసన చేపట్టారు. తప్పులు తడకగా జాబితాలు రూపొందించి ఆ తర్వాత సరిదిద్దామని ప్రకటన జారీ చేసి, మూడు రోజులైనా ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యాయుల చేతికి ఇంతవరకు ఉత్తర్వులు రాకపోవడంపై టీచర్లు అసహనం వ్యక్తం చేశారు.

పదోన్నతి కోసం జిల్లాలో 110 మంది భాషా పండితులు గంటల తరబడి వేచి చూస్తున్నారని, అధికారుల నుండి స్పష్టమైన సమాధానం రావడం లేదని భాషా పండితుల సంఘం నాయకులు వాపోయారు. అనంతరం డీఈఓ ప్రణీతను కలిసి పరిస్థితి వివరించగా.. డీఈవో విద్యాశాఖ ఆర్జెడి లింగయ్యతో మాట్లాడి పదోన్నతుల ఉత్తర్వుల గురించి వివరించారు. ఈరోజు ఎలాగైనా తప్పనిసరిగా ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇవ్వడంతో భాషా పండితులు వెనుదిరిగారు.

బయో సైన్స్.. సోషల్ కేటగిరి ఎస్ జి టి లకు పదోన్నతి..

స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం వేచి చూస్తున్న బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ ఎస్ జి టి ఉపాధ్యాయులకు గురువారం పదోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు. బయోసైన్స్ విభాగంలో 27 మంది, సోషల్ స్టడీస్ కేటగిరిలో 44 మందికి విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయగా వారంతా కేటాయించిన స్కూల్లలో చేరిపోయారు.

ఎస్ జి టి బదిలీలకు దరఖాస్తులు..

పదోన్నతుల ప్రక్రియ చివరి అంకానికి చేరుకోగా .. మరోవైపు ఎస్ జి టి ఉపాధ్యాయుల బదిలీలపై గురువారం ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ దరఖాస్తులు స్వీకరించింది. 2024 జూన్ 1వ తేదీ వరకు ఒకే పాఠశాలలో 8 సంవత్సరాలు సర్వీస్ నిండిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని డి ఇఓ ప్రణీత పేర్కొన్నారు. ఈ మేరకు బదిలీల కోసం టీచర్ల నుండి డీఈవో కార్యాలయంలో లిఖితపూర్వక దరఖాస్తులు స్వీకరించారు. ఖాళీలను బట్టి వీరిని భర్తీ చేయనున్నారు.

బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హిందువుల మీద కక్షసాధింపు చర్యలు

- రేవంత్ ప్రభుత్వం పై విరుచుక పడ్డ బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

హైదరాబాద్ జూన్ 120 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణలో గత

బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హిందువుల మీద కక్షసాధింపుగా వ్యవహరిస్తోందని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శంకర్ మాట్లాడుతూ గోవులను వధించకూడదని కోర్టులు స్పష్టంగా చెబుతున్నప్పటికీ మెదక్ లో వందలాది గోవులను వధించేందుకు తీసుకెళ్తుంటే గోరక్షకులు పోలీసులకు సమాచారం ఇచ్చినా కూడా కనీసం స్పందించలేదు. ఆవులను అక్రమంగా తరలిస్తున్నారని గోరక్షకులు పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించక పోవడంతో వాహనాలను గోరక్షకులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. నిందితులు గోరక్షకులపై దాడి చేశారు. అయినా పోలీసులు ఒక వర్గానికి కొమ్ముకాస్తు గోరక్షులను, హిందూ యువకులను దోషులుగా చిత్రీకరించి జైలుకు పంపారని దుయ్యబట్టారు..చివరికి పోలీస్ స్టేషన్ కు వెళ్లి దరఖాస్తులు ఇచ్చినా పట్టించుకోలేదు. అక్రమంగా గోవులను తరలిస్తుండగా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించి తిరిగి హిందూ యువకులపై అక్రమంగా 307సెక్షన్ కింద కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు..ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ లో కూడా వేలమంది ఒక బస్తీ మీద దాడులు చేస్తే పోలీసులు తూతూ మంత్రంగా కేసులు బనాయించిన్రు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా నిర్మాల్ జిల్లా భైంసా పట్టణంలో కూడా 23 మంది ఆంజనేయస్వామి భక్తులపై అక్రమంగా సెక్షన్ 307కేసులు పెట్టి వేధించారు. రాష్ట్రంలో శాంతిభద్రలు అదుపులో లేవు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి వద్దనే హోంశాఖ ఉన్నది. మెజారిటీ ప్రజల మనోభావాలు, హక్కులు కాలరాస్తూ హిందూ యువకుల మీద కక్షగట్టి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఏరకంగా ఎ ్ ర ి ఎ ా ల న చేయాలనుకుంటున్నది..?గత ముఖ్యమంత్రి కేసీఆర్ హిందువులను అవమానపరిచి, హిందూ యువకుల మీద అక్రమ కేసులు పెడితే ఎలాంటి శిక్ష అనుభవించారో కాంగ్రెస్ నాయకులు గ్రహించాలని పాయల్ శంకర్ హెచ్చరించారు..బీఆర్ఎస్ పార్టీ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తోంది. జరిగిన నాలుగు సంఘటనల మీద న్యాయ విచారణ జరపాలని భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రంలో మెజారిటీ ప్రజలకు హక్కులు లేవా...? హైకోర్టు చెప్పినా విచారణ జరపకుండా కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం నబబు కాదు. గోరక్షకులు సమాచారం అందించినా కూడా పోలీసులు స్పందించకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ లో ఉన్నదని చెప్తున్న రాష్ట్ర డీజీపీ జరిగిన సంఘటనల మీద విచారణ జరిపించాలి. మెజారిటీ ప్రజల మీద కేసులు పెడితేనే రాష్ట్రంలో లా అండ్ ఆర&ఢర్ కంట్రోల్ లో ఉన్నట్టా డీజీపీ గారు..??144సెక్షన్లు, 307సెక్షన్లు హిందువులకు మాత్రమే వర్తిస్తయా..?జరిగిన సంఘటనల మీద రాష్ట్ర ప్రభుత్వమే చిత్తశుద్ధితో విచారణ చేయించాలని డిమాండ్ చేసారు. విచారణ జరిపించకపోతే మిగతా కమిషన్లను కూడా ఆశ్రయిస్తాం. హిందువులపై దాడుల ఘటనలపై అసలు విషయాలు బయటకు తెలిసేంతవరకు, అసలు నిందితులపై చర్యలు తీసుకునేవరకు బిజెపి పోరాటం ఆగదన్నారు. ఈ సమావేశం లో ఎంఎల్ఏ హరిబాబు,సంగప్ప , మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ వినియోగ వ్యయ సర్వే (హెచ్ సి ఇ ఎస్)

2022-23 పైన న్యూఢిల్లీలో డాటా యూజర్ సమావేశం.

న్యూఢిల్లీ, జూన్ 20 :కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖకు చెందిన ది నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ ఎస్ ఎస్ ఓ) కార్యాలయంవారి ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా గృహ వినియోగ వ్యయ సర్వేలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆ సంస్థ ఏర్పడిన 1950 సంవత్సరంనుంచీ ఈ సర్వే జరుగుతోంది. ఈ మధ్యనే ఎన్ ఎస్ ఎస్ ఓ వారు హెచ్ సిఇఎస్ ను ఆగస్ట్ 2022నుంచి జులై 2023వరకూ నిర్వహించారు. ఈ సర్వే ద్వారా దేశంలో ప్రతి ఇంటికి సంబంధించి నెలవారీ తలసరి ఆదాయ వినియోగ వ్యయమనేది (ఎంపీ సీఇ), గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోను, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోను, వివిధ సామాజిక ఆర్థిక వర్గాల్లోను ఎలా వుందనేది తెలుస్తుంది. హెచ్ సి ఇ ఎస్ 2022-23కు సంబంధించిన వాస్తవ పట్టికను ఈ ఏడాది ఫిబ్రవరి 24న విడుదల చేయడం జరిగింది. సర్వేకు సంబంధించిన వివరణాత్మక ఫలితాలు, యూనిట్ స్థాయి సమాచారం ఈ నెల 7న ప్రచురించడం జరిగింది.

ఈ నేపథ్యంలో హెచ్ సి ఇ ఎస్ 2022-23పై ఒక రోజు డాటా యూజర్ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతోంది. ఈ సమావేశాన్ని ఈ నెల 19న న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నారు. దీని ద్వారా కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ సంబంధిత డాటా వినియోగదారులు/ భాగస్వాములతో చర్చించి ఫీడ్ బ్యాక్ తీసుకుంటుంది. ఈ సమావేశంలో హెచ్ సిఇఎస్‌కు సంబంధించిన పలు కీలకమైన అంశాలు, నిర్వచనాలు, కీలక ఫలితాలు, యూనిట్ స్థాయి సమాచారం, సమాచార నాణ్యత గురించి చర్చించడం జరుగుతుంది.

ఈ సమావేశానికి ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అధ్యక్షుడు డాక్టర్ వివేక్ దేవరాయ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. జాతీయ గణాంకాల కమిషన్ (ఎన్ ఎస్ సి) అధ్యక్షులు, సభ్యులు ఈ సమావేశంలో పాల్గొంటారు. జాతీయ శాంపిల్ సర్వే స్టీరింగ్ కమిటీ సభ్యులు, గణాంకాల శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గణాంకాల మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులు, ఇంకా ఇతర కేంద్ర మంత్రిత్వశాఖ అధికారులు, అంతర్జాతీయ సంస్థలకు చెందిన పలువురు ప్రతినిధులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు, పరిశోధనా విద్యార్థులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదల చుకున్నవారు కింది యూట్యూబ్ లింక్ ద్వారా కూడా హాజరు కావచ్చు.

కుళ్ళిపోయిన చికెన్ ..నిల్వ ఉంచిన మాంసం.. వాటినే కస్టమర్ లకు సరఫరా..

-ఏం.ఎస్ .ఆర్ బార్ అండ్ రెస్టారెంట్లో తనిఖీలు
-కుళ్ళిపోయిన చికెన్ ?నిల్వ ఉంచిన మాంసం
-ప్రాణంతకరమైన టెస్టింగ్ సాల్ట్, కలర్స్ స్వాధీనం?
-ఫ్రిజ్లో నిల్వ ఉంచిన రైస్, గ్రేవీ పదార్థాలు

నిజామాబాద్, జూన్ 20 :నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కొరడా ఘులుపిస్తున్నారు. గురువారం నిజాంబాద్ నగరంలోని

వినాయక నగర్ ప్రాంతంలో గల ఎమ్మెస్సార్ బార్ అండ్ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారి తారా సింగ్ నాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఫ్రిజ్లో నిల్వ ఉంచిన చికెన్, కొన్ని రోజుల క్రితం వండిపెట్టిన చికెన్ లెగ్ పీస్ లు, ప్రాణాంతకరమైన టెస్టింగ్ సాల్టు కలర్స్, ఇతర ఆహార పదార్థాలను పొడి సేట్టి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అంతేకాకుండా ఐదు రోజుల క్రితం వండి ఫ్రిజ్లో నిల్వ ఉంచిన గ్రేవ్ ను , ఆహార పదార్థాలను చెత్తబుట్టలో వేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ అధికారి టి .నాయక్ హెచ్చరించారు. రెస్టారెంట్లు హోటల్లు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు పరిశుభ్రత పాటించాలని కాలం చెల్లిన ఆహార పదార్థాలు వాడితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన జిల్లా కలెక్టర్‌కు ఘన స్వాగతం..

ఆదిలాబాద్, జూన్ 20 ::నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్ (ఐఎఏస్) కు ఘనస్వాగతం పలుకుతూ ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో తేనేటి విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇవాళ జిల్లా క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జడ్జి లకు, సీనియర్ పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల (ఐపిఎస్), తేనేటి విందు, అల్పాహారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా స్థితిగతుల గురించి, లా అండ్ ఆర్డర్ విషయాల మీద ముచ్చటించారు. జిల్లాలో ప్రస్తుత శాంతిభద్రతల గురించి పోలీస్ ఉన్నతాధికారులను, అధికారులను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు లా అండ్ ఆర్డర్ నిర్వహణలో సమర్థవంతంగా ఉన్నారని, రెవెన్యూ శాఖ జుడీషియరీకి శాఖలు సమర్థంగా పనిచేసినప్పుడే సరైన సత్ఫలితాలు వస్తాయన్నారు.

ఈ సందర్భంగా నూతన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రశాంతంగా ఉంటేనే ఆ జిల్లా అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. అందుకోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, ఎల్లప్పుడూ ఫోన్ లో అందుబాటులో ఉంటూ తగిన తోడ్పాటు కల్పిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జిలు జి.రాధిక. జె.భవిష్య, ఆర్.అజయ్ కుమార్, నిర్మల్ డిఎస్పి గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, గ్రామీణ సిఐ శ్రీనివాస్, సోన్ సీఐ నవీన్ కుమార్, ఖానాపూర్ సిఐ సైదారావు, ముదోల్ సిఐ మల్లేష్, బైంసా రూరల్ సిఐ నైలు, బైంసా పట్టణ సీఐ రాజారెడ్డి, డిసియర్బి సీఐ గోపీనాథ్, ఆర్ఐలు శైలేందర్, రామ్ నిరంజన్, రామకృష్ణ, డీపీఓ సూపరిండెంట్ శ్రీనివాస్ ఆర్ఎస్ఐలు, కలెక్టర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి పార్థసారథిని కలిసిన ఎపిఎంఎఫ్ నేతలు

విజయవాడ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస);సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖామాత్యులు శ్రీ కొలుసు పార్థసారథి ని విజయవాడలోని వారి నివాసంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఎపిఎంఎఫ్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి. ఢిల్లీబాబు రెడ్డి ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రభుత్వం పరంగా చేపట్టవలసిన చర్యలపై ఢిల్లీబాబు రెడ్డి మంత్రి శ్రీ పార్థసారథి గారితో చర్చించారు. ఆయా సమస్యల పరిష్కారం పట్ల మంత్రి శ్రీ పార్థసారథిగారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్, ఎపిఎంఎఫ్ నాయకులు ఐ. వెంకటరామరాజు, పీతల అప్పాజీ, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మియావాకి ప్లాంటేషన్ పద్ధతితో జాతీయ రహదారుల వెంబడి పచ్చదనాన్ని పెంపొందించనున్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్ హెచ్ ఏ ఐ)

న్యూఢిల్లీ, జూన్ 20 :జాతీయ రహదారులను పచ్చదనంతో నింపాలనే దార్శనికతను సాకారం చేయడానికి, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వివిధ ప్రదేశాలలో జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న భూములలో మియావాకి మొక్కల పెంపకాన్ని చేపట్టడానికి ప్రత్యేక చొరవ తీసుకోనుంది. మియావాకి ప్లాంటేషన్ ఏర్పాటు కోసం ఢిల్లీ-ఎన్సీఆర్ చుట్టుపక్కల వివిధ ప్రాంతాల్లో మొత్తం 53 ఎకరాలకు పైగా భూమిని గుర్తించారు.

ద్వారకా ఎక్స్ ప్రెస్ వేలోని హర్యానా సెక్షన్ లో 4.7 ఎకరాలు, ఢిల్లీ-ముంబై ఎక్స్ ప్రెస్ వేలోని ఢిల్లీ-వడోదర సెక్షన్ లోని సోహ్నా సమీపంలో 4.1 ఎకరాల భూమి, హర్యానాలోని అంబాలా-కోట్ పుత్లీ కారిడార్ లోని ఎన్ హెచ్ 152డిలోని చాబ్రీ, ఖర్దా ఇంటర్ చేంజ్ పై సుమారు 5 ఎకరాల భూమి, ఎన్ హెచ్ 7 బైపాస్ పై 12 ఎకరాలకు పైగా భూమిని జాతీయ రహదారుల వెంట మియావాకి తోటల పెంపకానికి ప్రతిపాదించారు. ఇందులో ఘజియాబాద్ సమీపంలోని ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్ ప్రెస్ వేపై దుహై ఇంటర్ చేంజ్ సమీపంలో 9.2 ఎకరాలు, ఉత్తరప్రదేశ్ లోని ఎన్ హెచ్ -34లోని మీరట్ -నజీబాబాద్ సెక్షన్ వద్ద 5.6 ఎకరాలు ఉన్నాయి.

ఎంపిక చేసిన స్థలాల్లో ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి, 2024 ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తయ్యే వర్షాకాల సీజన్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

మియావాకి తోటలను మియాఎాకి పద్ధతి అని కూడా అంటారు. ఈ ప్రత్యేకమైన జపనీస్ విధానం పర్యావరణ పునరుద్ధరణ మరియు అడవుల పెంపకం అభివృద్ధి కి అవలంభించే ఓ పద్ధతి. తక్కువ సమయంలో దట్టమైన, స్థానిక మరియు జీవవైవిధ్య అడవులను సృష్టించడం ఈ పద్ధతి యొక్క లక్ష్యం. ఈ అడవులు భూగర్భజలాలను నిలువుకుని ఉంటాయి మరియు భూగర్భ జల మట్టాన్ని రీఛార్జ్ చేయడానికి సహాయపడతాయి. ఈ పద్ధతి ద్వారా చెట్లు పదిరెట్లు వేగంగా పెరిగి, తోటలు ధ్వని మరియు ధూళి అవరోధంగా పనిచేస్తాయి. మియావాకి ప్లాంటేషన్ పద్ధతిని విజయవంతంగా అమలు చేయడానికి, స్థానిక వాతావరణం మరియు నేల పరిస్థితులలో మనుగడ సాగించే దేశీయ జాతుల మొక్కలను నాటడంపై దృష్టి పెట్టనున్నారు.

మియావాకి అడవుల అభివృద్ధి స్థితిస్థాపక పర్యావరణ వ్యవస్థ సృష్టికి దోహదం చేస్తుంది, పర్యావరణానికి మరియు స్థానిక సమాజానికి వివిధ రకాల ప్రయోజనాలను అందిస్తుంది. మెరుగైన గాలి మరియు నేల నాణ్యత వంటి సూక్ష్మ-వాతావరణ పరిస్థితులలో మెరుగుదలలతో సహా ఇది బహుళ దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. ఇది జీవవైవిధ్య పరిరక్షణ, పచ్చదనాన్ని వేగంగా అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన కర్బన శోషణ, నేల పునరుద్ధరణ మరియు స్థానిక వృక్షజాలం మరియు జంతుజాలం కోసం ఆవాస సృష్టికి కూడా సహాయపడుతుంది. ఢిల్లీ/ఎన్సీఆర్లో మియావాకి ప్లాంటేషన్ సాధించిన విజయం ఆధారంగా దేశవ్యాప్తంగా ఇదే పద్ధతి పునరావృతమవుతుంది.

మియావాకి పద్ధతిని ఉపయోగించి, పచ్చదనాన్ని పెంచడం వల్ల జాతీయ రహదారుల వెంట నివసించే పౌరుల ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచడమే కాకుండా, ఎన్సిఆర్లోని జాతీయ రహదారుల అందాన్ని పెంచుతుంది మరియు ప్రయాణ సమయంలో ఆనందాన్ని పెంచుతుంది.

బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి!

- తెలంగాణ ఉద్యమనేత భారత సుదర్శన్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 20 ::తెలంగాణలోని బొగ్గు మరియు ఇతర గనులను కేంద్రం వేలం వేయడాన్ని వెంటనే నిలిపివేయాలని తెలంగాణ ఉద్యమనేత, సీనియర్ జర్నలిస్ట్ భారత సుదర్శన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి న్యాయం చేయకుండా 'తెలంగాణ సహజ సంపద, వనరులు' తరలించుకపోవడం అంటే తెలంగాణకు తీరని అన్యాయం చేసినట్లేనన్నారు. రాష్ట్ర పునర్విభజన తర్వాత కేంద్రం తెలంగాణకు సరైన న్యాయం చేయలేదన్నారు. తెలంగాణ ఉద్యమమే తెలంగాణ వనరుల పరిరక్షణ కోసం జరిగిందని, తెలంగాణ ప్రజల ప్రమేయం లేకుండా బొగ్గు, ఇతర గనులను వేలం వేయడమంటే తెలంగాణ మాతృభూమిని, తెలంగాణ ప్రజలను కేంద్రం తీవ్రంగా వంచించ డమేనన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతిని ధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులే బాధ్యత వహించాలని, వేలం వేసే ప్రక్రియను రద్దు చేసుకోవాలని తెలంగాణ ఉద్యమనేత భారత సుదర్శన్ కోరారు.

కాంగ్రెస్ గూటికి.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు.. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం సెగ

ఆదిలాబాద్, జూన్ 20 ::వరుస రాజీనామాలు, వలసలు బీఆర్ఎస్ పార్టీని కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. మాజీ మంత్రి జోగు రామన్నకు ప్రధాన అనుచరులుగా ఉన్న వార్డు నెంబర్ (36) రవీంద్ర నగర్ కాలనీ కౌన్సిలర్ గంధ్రత్ రాజేందర్, వార్డు నెంబర్ 2 మహాలక్ష్మి వాడ చిలుకూరి నగర్ కౌన్సిలర్ సంద నర్సింగ్, దీపాయిగూడకు చెందిన సీనియర్ నాయకులు బండారి చిన్నయ్య గులాబీ పార్టీకి గుడుబై చెప్పి బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సీనియర్లతో పాటు ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు వెంకన్న సాయి ప్రణయ్, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, లక్ష్మణ్, తదితరులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరు సీనియర్ కౌన్సిలర్లు గులాబీ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరడం చర్చనీయాంశమైంది. ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ పై అవిశ్వాసానికి తెరలేచింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కు చెందిన 34 మంది అవిశ్వాసానికి రహస్యంగా సంతకాలు పెట్టి కలెక్టర్ కు నోటీసు ఇవ్వడానికి సిద్ధమైనట్టు తెలిసింది. అయితే బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ పరిణామాలపై చర్చించి వైస్ చైర్మన్ తో పాటు మున్సిపల్ చైర్మన్ పై కూడా అవిశ్వాసానికి పావులు కలుపుతున్నట్టు బీజేపీలో చర్చ సాగుతోంది. రెండు రోజుల్లో అవిశ్వాసాలపై పార్టీ నేతల అభిప్రాయం వెల్లడి కానుంది.

భారత విప్లవోద్యమానికి మావో ఆలోచన విధానమే సరైన మార్గం

-కామ్రేడ్ రాధక్క అని పలువురు నేతల ఘన నివాలి

సిద్దిపేటజూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్); భారత విప్లవోద్యమానికి భుక్తి, పీడిత ప్రజలకు విముక్తిని కలిగించే లక్ష్యంతో ఆయుధాన్ని

మావో ఆలోచన విధానమే సరైనదని గుర్తించిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ రాధక్క అని పలువురు నేతలు కొనియాడారు.

గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో సీపీఐ(యం ఎల్) నీపీ పార్టీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ కామ్రేడ్ సిపిరెడ్డి నిర్మించిన గోదావరిలోయ రైతాంగ ప్రతిఘటన పోరాటంలో బాగస్వామి అయ్యింది. వ్యక్తిగత కుటుంబ జీవితాన్ని త్యాగం చేసింది. భూమి, ఎత్తిపట్టింది.

ఆత్మరక్షణ పోరాటంలో దళకమాండర్ గా ఎదిగింది. కామ్రేడ్ సిపిరెడ్డి కి అండగా నిలబడింది. విప్లవ ప్రతిఘనోద్యమంలో సిపిగారి సేవలను, తపనను గుర్తించి, ఆయన బాగోగుల కొరకు జీవిత సహచరి అయ్యింది. కామ్రేడ్ సిపిరెడ్డి తో పాటు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఉద్యమ విస్తరణకు పాటుపడింది. గ్రామికవర్గ ప్రియమైన నేతగా ప్రజల మనసులలో నిలిచిపోయింది. ఎన్నో ఆటుపోటులను, నిత్య నిర్బందాలను చవిచూసింది. అవమానాలను ఎదుర్కొన్నది. కామ్రేడ్ సిపి మరణాతరం గోదావరిలోయ విప్లవోద్యమాన్ని సజీవంగా నిలబెట్టేందుకు క్రుషిచేసింది. ఎక్కడ రాజీ పడకుండా తను నమ్మిన సిద్ధాంతం కోసం చివరిదాకా పోరాడింది. ప్రజలకు పార్టీ శ్రేణులకు వర్గ, విప్లవ చైతన్యాన్ని అందించింది. పటేల్, పట్వారీలు, ఫారెస్ట్ అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను కదిలించింది. లక్షలాది ఎకరాల ఆదివాసి, గిరిజన, గిరిజనేతర పేద ప్రజలకు భూములు వంచే కార్యక్రమానికి నాయకత్వం వహించింది. దోపిడీ, పీడన, అణిచివేతలకు

వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ఉక్కు మనిషిగా కామ్రేడ్ రాధక్క కొనియాడబడింది. బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించే క్రమంలో ఆచరణలో ఎన్నో రాజకీయ, సిద్ధాంత, నిర్మాణ సమస్యలను ఎదుర్కొన్నది. తుదిశ్వాస వరకు విప్లవ జీవితానికే అంకితమైన కామ్రేడ్ రాధక్కను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.. విప్లవోద్యమంలో వ్యక్తిగత పనివిధానం, ఒంటెత్తు పోకడలు అనుసరించడం వలన చీలికలకు, పేలికలకు గురౌతున్నాయి. ఇలాంటి పెడ ధోరణులు విప్లవాన్ని ప్రక్కదారి పట్టిస్తాయని గుర్తించాలన్నారు. కామ్రేడ్ రాధక్క మరణం పట్ల సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ, కేంద్ర కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తుందని తెలిపారు

అనూహ్యంగా పెరిగిన అమ్మవారి ఆదాయం.. 16 రోజులకు మూడున్నర కోట్లు

అమరావతి, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): ఇంద్రకీలాద్రిపై వెలిసిన దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో కనకదుర్గమ్మ దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఈ క్రమంలో కనకదుర్గమ్మ ఆలయానికి మునుపెన్నడూ లేని విధంగా అనూహ్య రీతిలో ఆదాయం పెరుగుతుంది. గడిచిన 16 రోజుల్లో అమ్మవారి ఆలయానికి సుమారు మూడున్నర కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. అమ్మవారికి రోజుకు సగటున 21 లక్షల రూపాయల ఆదాయం భక్తుల నుంచి సమకూరుతోంది.

ఆలయంలోని హుండీలను గురువారం మహా మండపం ఆరో అంతస్తులో కెఎన్ రామారావు సమక్షంలో సిబ్బంది లెక్కించారు. ఈ హుండీ లెక్కింపులో భాగంగా 16

రోజుల అమ్మవారి ఆదాయం నగదు రూపంలో రూ.3,23,75,523/- గా ఉంది. అంటే భక్తుల నుంచి రోజుకు సగటున రూ.20,23,470/- ఆదాయం వస్తుంది. ఇక 694 గ్రాముల బంగారం, 264 గ్రాముల 6 కిలోల వెండిని భక్తులు కానుకగా హుండీ ద్వారా సమర్పించారు.

భక్తులు విదేశీ కరెన్సీ యూఎస్ఏ 516 డాలర్లు, ఆస్ట్రేలియా 100 డాలర్లు, కొరియా 1000 వాన్, ఇంగ్లాండ్ 40 పౌండ్లు, ఒమన్ 100 బిమ్సా, కెనడా 15 డాలర్లు, యూఏఈ 25 దిర్హామ్‌లు, కువైట్ 1 దినార్, ఖతార్ 24 రియాల్స్, సింగపూర్ 2 డాలర్లు కానుకలుగా చెల్లించారు. ఆన్‌లైన్ ఈ హుండీ ద్వారా భక్తులు రూ.59,380/- చెల్లించుకున్నారు.

రూ.20,000 కోట్లకు పైబడిన పిఎం కిసాన్ 17వ వాయిదా సొమ్ము విడుదల

న్యూఢిల్లీ, జూన్ 20 :ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు ఉత్తర ప్రదేశ్ లోని వారణాసిలో కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ ను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం-కిసాన్) కింద 9.26 కోట్ల మంది లబ్ధిదారులకు 17వ వాయిదా సొమ్ము రూ.20,000 కోట్లు ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలోనే 30,000 మంది పైగా స్వయం సహాయక బృందాల సభ్యులకు కృషిసఖి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. టెక్నాలజీ సహాయంతో దేశవ్యాప్తంగా భిన్న ప్రాంతాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమంతో అనుసంధానం అయ్యారు.

ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించడానికి ముందు వారణాసి నియోజకవర్గం నుంచి పార్లమెంటరీ ఎన్నికల్లో గెలుపొందిన అనంతం తొలిసారి వచ్చిన సందర్భంగా ప్రజలకు అభివాదం తెలిపారు. వరుసగా మూడో సారి కూడా తనను ఎన్నుకున్నందుకు ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. "గంగా మాత కూడా నన్ను దత్తత తీసుకున్నట్టు కనిపిస్తోంది. నేను కాశీకి స్థానికుడుగా మారాను" అని ఆనందంలో పిఎం శ్రీ మోదీ అన్నారు.

ఇటీవల జరిగిన 18వ లోక్ సభ ఎన్నికలు భారత ప్రజాస్వామ్య మూలాలు, విస్తృతి, సామర్థ్యం, సమగ్రతకు నిదర్శనంగా నిలిచాయని, ఆ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయని ప్రధానమంత్రి అన్నారు. ఈ ఎన్నికల్లో 64 కోట్ల మందికి పైగా ప్రజలు ఓటు వేశారని గుర్తు చేస్తూ ఇంత భారీ ఎన్నిక ప్రపంచంలో ఎక్కడా ఇంతవరకు జరగలేదని, ఇంత భారీ సంఖ్యలో పౌరుల భాగస్వామ్యం చూడలేదని వ్యాఖ్యానించారు. ఇటీవల జి7 శిఖరాగ్రంలో పాల్గొనేందుకు తాను ఇటలీ సందర్శించడాన్ని ప్రస్తావిస్తూ ఆ జి7 దేశాల ఓటర్లతో పోల్చితే మన ఓటర్ల సంఖ్య ఒకటిన్నర రెట్ల కన్నా అధికమని చెప్పారు. అదే విధంగా యూరోపియన్ యూనియన్ దేశాలన్నింటి ఓటర్ల కన్నా రెండున్నర రెట్లు అధికమని తెలిపారు. అంతే కాదు 31 కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు ఈ ఎన్నికలో ఓటు వేశారంటూ ప్రపంచంలో ఏ దేశంలో అయినా ఇంత భారీ సంఖ్యలో మహిళా ఓటర్ల ఓటింగులో పాల్గొనడం ఇదే ప్రథమమని పిఎం శ్రీ మోదీ అన్నారు. ఆ సంఖ్య అమెరికా జనాభాతో సమానమని కూడా పేర్కొన్నారు. "ప్రపంచం యావత్తును ఆకర్షించి, ప్రభావితం చేయడమే భారత ప్రజాస్వామ్య శక్తి, సౌందర్యం" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య ఉత్సవంలో పాల్గొని దాన్ని ఎంతో అద్భుతంగా విజయవంతం చేసినందుకు వారణాసి ప్రజలకు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. "వారణాసి ప్రజలు పార్లమెంటు సభ్యుడిని ఎన్నుకోవడమే కాదు..ఏకంగా ప్రధానమంత్రినే ఎన్నుకున్నారు" అంటూ పిఎం శ్రీ మోదీ హర్షాతిరేకం ప్రకటించారు.

ఎన్నికైన ప్రజా ప్రభుత్వాన్ని మూడో సారి కూడా అధికారంలోకి తెచ్చిన ఈ ఎన్నికల ఫలితం కూడా "అసాధారణం" అని, ప్రపంచ ప్రజాస్వామ్యాల్లోనే అరుదైనదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. "60 సంవత్సరాల క్రితం భారతదేశంలో ఈ తరహా హ్యాట్రిక్ జరిగింది" అన్నారు. "యువత ఆకాంక్షలు భారీగా ఉన్న భారత్ వంటి దేశంలో 10 సంవత్సరాల పరిపాలన అనంతరం సైతం అదే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం అతి పెద్ద విజయం, అతి పెద్ద విశ్వాస ప్రకటన. మీరందరూ ప్రకటించిన ఈ విశ్వాసమే దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు నాకు అతి పెద్ద మూలధనం. ఇది నా శక్తిని మరింత ఇనుమడింపచేస్తుంది" అని వ్యాఖ్యానించారు.

అభివృద్ధి చెందిన భారతదేశానికి రైతులు, నారీశక్తి, యువత, పేదలు నాలుగు మూల స్తంభాలుగా తాను భావిస్తానని అంటూ ఈ విదత ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తీసుకున్న తొలి నిర్ణయం రైతులు, పేద కుటుంబాల కోసమేనన్న విషయం ఆయన గుర్తు చేశారు. పిఎం ఆవాస్ యోజన కింద అదనంగా 3 కోట్ల ఇళ్ల నిర్మాణ, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల నిర్ణయాలు కోట్లాది మందికి సహాయపడతాయని ప్రధానమంత్రి చెప్పారు.

ఈ కార్యక్రమానికి హాజరైన రైతులకు ఆయన అభివాదం తెలిపారు. టెక్నాలజీ సహాయంతో ఈ కార్యక్రమాన్ని దేశం మొత్తానికి అనుసంధానం చేశారు. కోట్లాది మంది రైతుల ఖాతాల్లో సుమారు రూ.20,000 కోట్లు జమ చేసినట్టు ఆయన చెప్పారు. కృషిసఖి కార్యక్రమం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఇందులో భాగంగా 3 కోట్ల మంది "లఖ్ పతి దీదీ"లను తయారుచేస్తున్నట్టు తెలియచేశారు. దీని వల్ల మహిళల ఆత్మ గౌరవం పెరగడంతో పాటు లబ్ధిదారులకు ఒక చక్కని ఆదాయ వనరు హామీగా లభిస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

"పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ప్రపంచంలోనే అతి పెద్ద ప్రత్యక్ష నగదు బదిలీ పథకంగా మారింది" అంటూ దీని కింద కోట్లాది మంది రైతుల ఖాతాల్లోకి రూ.3.25 లక్షల కోట్లు బదిలీ చేశారని, అందులో ఒక్క వారణాసిలోని కుటుంబాలకే రూ.700 కోట్లు బదిలీ అయిందని ప్రధానమంత్రి చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు ఈ ప్రయోజనాన్ని చేర్చడంలో టెక్నాలజీ వినియోగాన్ని ప్రధానమంత్రి కొనియాడారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సందర్భంగా కోటి మందికి పైగా రైతులు పిఎం కిసాన్ పథకంలో భాగస్వాములుగా చేరారని ఆయన తెలిపారు. అందరికీ దాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు పథకం నియమ, నిబంధనలు సరళం చేసినట్టు ఆయన చెప్పారు. "లక్ష్యాలు, నమ్మకాలు సరైనవి అయినప్పుడు రైతు సంక్షేమానికి సంబంధించిన పనులు కూడా వేగంగా జరుగుతాయి" అని శ్రీ మోదీ అన్నారు.

21వ శతాబ్దిలో భారతదేశం ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందడంలో వ్యవసాయ రంగం పాత్ర గురించి పిఎం శ్రీ మోదీ ప్రస్తావిస్తూ పప్పులు, నూనెగింజల ఉత్పత్తిలో స్వావలంబన సాధించాలని, ప్రపంచ దృక్పథంలో పని చేయాలని పిలుపు ఇచ్చారు. దేశం వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుగా మారవలసి ఉందని నొక్కి చెప్పారు. స్థానిక ప్రాంతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లో ఆదరణ లభిస్తోందంటూ ఒక జిల్లా, ఒక ఉత్పత్తి పథకం, ప్రతీ జిల్లాలోనూ ఎగుమతుల కేంద్రం నెలకొల్పడం ద్వారా ఎగుమతులకు ఉత్తేజం లభిస్తోందని చెప్పారు. "ప్రపంచంలోని అన్ని దేశాల్లోని డైనింగ్ టేబుల్స్ పై భారతదేశానికి చెందిన కనీసం ఒక ఆహార ఉత్పత్తి అయినా ఉండాలి" అన్నదే తన కల అని తెలిపారు. జీరో డిఫెక్ట్-జీరో ఎఫెక్ట్ మంత్రం వ్యవసాయానికి కూడా వర్తిస్తుందని ఆయన అన్నారు. కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా చిరుధాన్యాలు, మూలికా ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయానికి మద్దతు ఇస్తున్నట్టు ఆయన చెప్పారు.

భారీ సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనడాన్ని ప్రస్తావిస్తూ వ్యవసాయంలో వారి పాత్ర, మద్దతు కీలకమని ప్రధానమంత్రి అన్నారు. వారి వాటాను మరింతగా పెంచేందుకు వ్యవసాయ రంగం పరిధిని విస్తరించాలని సూచించారు. కృషిసఖి కార్యక్రమం గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ డ్రోన్ దీదీ కార్యక్రమంతో సమానమైన కార్యక్రమంగా దీన్ని అభివర్ణించారు. దేశం ఇప్పటికే ఆశా కార్యకర్తలు, బ్యాంక్ సఖిల శక్తిని చూసిందని, ఆ తరహాలోనే ఇప్పుడు కృషిసఖిల సామర్థ్యాలను కూడా వీక్షిస్తుందని అన్నారు. కృషిసఖిలుగా 30,000 మంది స్వయం సహాయక బృందాల మహిళలకు సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. దేశంలోని 11 రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఉన్న వేలాది ఎన్ హెచ్ జిలనుఅనుసంధానం చేస్తారని తెలిపారు. 3 కోట్ల మంది లఖ్ పతి దీదీలను తయారుచేయడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

కాశీ, పూర్వాంచల్ కు చెందిన రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి చెప్పారు. బనస్ డెయిరీ సంకుల్, త్వరగా చెడిపోయే స్వభావం గల ఉత్పత్తుల రవాణా కేంద్రం, ఇంటిగ్రేటెడ్ ప్యాకేజింగ్ హౌస్ ఏర్పాటు గురించి ప్రస్తావించారు. "బనస్ డెయిరీ బెనారస్ చుట్టుపక్కల ప్రాంతాల రైతులు, పశు పెంపకందారుల అదృష్టాన్ని మార్చేసింది. నేడు ఈ డెయిరీ రోజూ 3 లక్షల లీటర్ల పాలను సేకరిస్తోంది. కేవలం బెనారస్ కు చెందిన 14 వేలకు పైబడిన పశు పెంపకందారుల కుటుంబాలు ఈ డెయిరీలో నమోదయ్యాయి. రాబోయే ఏడాదిన్నర కాలంలో కాశీకి చెందిన మరో 16 వేల మంది పైగా పశు పెంపకందారులను కూడా ఈ డెయిరీ నమోదు చేసుకోనుంది. బనస్ డెయిరీ వచ్చిన తర్వాత పలువురు పాల ఉత్పత్తిదారుల ఆదాయం రూ.5 లక్షల వరకు పెరిగింది" అని ప్రధానమంత్రి చెప్పారు. మత్స్యకారుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన వివరించారు. పిఎం మత్స్య సంపద యోజన, కిసాన్ క్రెడిట్ కార్డుల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. వారణాసిలో చేపల పెంపకంలో కృషి చేస్తున్న వారికి సహాయంగా చందోలిలో రూ.70 కోట్లతో ఆధునిక చేపల మార్కెట్ నిర్మిస్తున్నట్టు ఆయన తెలియచేశారు.

పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన వారణాసిలో వెలుగులు ప్రసరించడం పట్ల ప్రధానమంత్రి హర్షం ప్రకటించారు. ఇప్పటికే 40 వేల మంది స్థానికులు ఈ పథకం కింద నమోదు కాగా 2500 ఇళ్లకు సోలార్ పానెల్స్ ఏర్పాటు చేసుకున్నాయి. మరో 3000 ఇళ్లలో ఆ పని పురోగతిలో ఉంది అని ఆయన తెలియచేశారు. ఇది ద్వంద్వ ప్రయోజనంగా ఉన్నదని, ఒక పక్క విద్యుత్తు బిల్లు జీరో కావడంతో పాటు మరోపక్క లబ్ధిదారులకు అదనపు ఆదాయం కూడా సమకూరుతుంది. వారణాసి, సమీప గ్రామాల కనెక్టివిటీ మరింతగా పెంచడానికి గత పది సంవత్సరాలుగా జరుగుతున్న పనుల గురించి వివరిస్తూ వారణాసిలో దేశంలోనే తొలి నగర రోప్ వే ప్రాజెక్టు తుది దశకు చేరుతున్నదని ఆయన చెప్పారు. ఘాజీపూర్, అజాంగఢ్, జాన్ పూర్ లను అనుసంధానం చేసే రింగ్ రోడ్డు; ఫుల్వారియా, చౌకాఘాట్ ఫ్లై ఓవర్లు; కాశీ, వారణాసి, కంటోన్మెంట్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు జరుగుతున్నట్టు తెలిపారు. బాబత్ పూర్ ఎయిర్ పోర్ట్ తో విమానయాన విభాగంలో రద్దీ తగ్గుతుందన్నారు.

గంగా ఘాట్ల వెంబడి అభివృద్ధి పనులు, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో కొత్త సదుపాయాల ఏర్పాటు, నగరంలో కుండ్ ల పునర్నిర్మాణం పనులు జరుగుతున్నట్టు ఆయన చెప్పారు. వారణాసిలోని వివిధ ప్రాంతాల్లో కొత్త వ్యవస్థలు నిర్మాణం అవుతున్నాయన్నారు. వారణాసిలో క్రీడా మౌలిక వసతుల కల్పన, నిర్మాణం అవుతున్న కొత్త స్టేడియం యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతాయన్నారు.

కాశీకి మేథో రాజధానిగా గల ప్రాచుర్యం గురించి కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారు. వారనత్వ నగరం ఏ విధంగా పట్టణాభివృద్ధిలో కొత్త చరిత్ర లిఖిస్తుందనేది ప్రపంచం యావత్తుకు కాశీ తెలియచేస్తోందని ఆయన అన్నారు. "కాశీలో ప్రతీ ప్రాంతంలోనూ వారసత్వం, అభివృద్ధి సమాంతరంగా కనిపిస్తున్నాయి. ఈ అభివృద్ధి కాశీకి మాత్రమే లాభదాయకం కాదు. పూర్వాంచల్ నుంచి కాశీకి పనులు, అవసరాల కోసం వస్తున్న కుటుంబాలన్నీ కూడా ప్రయోజనం పొందుతాయి" అని ప్రధానమంత్రి శ్రీ మోదీ చెప్పారు. "బాబా విశ్వనాథ్ ఆశీస్సులతో కాశీ అభివృద్ధి నిరంతరాయంగా సాగుతుంది" అంటే శ్రీ మోదీ ప్రసంగం ముగించారు.

ఉత్తర ప్రదేశ్ గవర్నర్ శ్రీమతి ఆనందిబెన్ పటేల్, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్య నాథ్; కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్; కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి శ్రీ భగీరథ్ చౌదరి, ఉప ముఖ్యమంత్రులు శ్రీ కేశవ్ ప్రసాద్ మౌర్య, శ్రీ బ్రజేష్ పాఠక్, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వంలోని మంత్రులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రధానమంత్రిగా మూడో సారి ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ నరేంద్ర మోదీ పిఎం కిసాన్ నిధి కింద 17వ వాయిదా సొమ్మును విడుదల చేయడానికి అధికారం ఇస్తూ తొలి ఫైల్ పై సంతకం చేయడమే రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వ కట్టుబాటును ప్రతిబింబిస్తుంది. ఈ కట్టుబాటుకు కొనసాగింపుగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం-కిసాన్) లబ్ధిదారులైన 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి 17వ వాయిదా కింద ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో రూ.20,000 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు పిఎం-కిసాన్ కింద 11 కోట్లకు పైగా అర్హత గల రైతు కుటుంబాలు రూ.3.04 లక్షల కోట్లకు పైగా సొమ్ము అందుకున్నాయి.

అలాగే 30,000 మంది పైగా స్వయం సహాయక గ్రూప్ ల మహిళలకు కృషిసఖి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఈ కృషిసఖి కన్వర్జెన్స్ ప్రోగ్రామ్ (కెఎస్ సిపి) గ్రామీణ మహిళలను కృషిసఖిలుగా సాధికారం చేసి గ్రామీణ భారతాన్ని పరివర్తం పచేస్తోంది. వారికి కృషిసఖిలు గా శిక్షణ ఇచ్చి పారా ఎక్స్ టెన్షన్ వర్కరుగా సర్టిఫికెట్లు మంజూరు చేస్తారు. "లఖ్ పతి దీదీ" కార్యక్రమానికి చెందిన ఇతర లక్ష్యాలతో వారిని ఈ సర్టిఫికేషన్ అనుసంధానం చేస్తుంది.

మెదక్‌లో అల్లర్లకు పోలీసుల వైఫల్యమే : ఎంపీ రఘునందన్ రావు

మెదక్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: బక్రీద్‌కు రెండు రోజుల ముందు మెదక్‌లో చోటుచేసుకున్న అల్లర్లు పోలీసుల వైఫల్యంతోనే అని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఈ అల్లర్లలో అరెస్టు అయిన బీజేపీ నేతల బెయిల్ పిటిషన్ ఈరోజు (గురువారం) దాఖలు చేశారు. వారి తరపున మెదక్ జిల్లా న్యాయస్థానంలో ఎంపీ, న్యాయవాది రఘునందన్ రావు వాదించారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ... పోలీసుల వైఫల్యాలను కోర్టు పెద్దలకు వివరించామని చెప్పారు. పిటిషన్ ఇచ్చిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే మెదక్‌లో అల్లర్లు జరిగేవి కావని తెలిపారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ 21 కి వాయిదా వేశారన్నారు. కార్యకర్తలకు కష్టమొస్తే అక్కడ రఘునందన్ ఉంటాడని అన్నారు. ఎంపీలకు సన్మానం ఉన్నా ..కార్యకర్తలకంటే ఎక్కువ సన్మానాలు కాదని ఇక్కడికి వచ్చానని అన్నారు. కార్యకర్తల కష్టంతోనే మెదక్ ఎంపీగా గెలిచానని తెలిపారు. వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్ గూటికి.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు.. వైస్ చైర్మన్ పై అవిశ్వాసం సెగ

ఆదిలాబాద్, జూన్ 20 ::వరుస రాజీనామాలు, వలసలు బీఆర్ఎస్ పార్టీని కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. మాజీ మంత్రి జోగు రామన్నకు ప్రధాన అనుచరులుగా ఉన్న వార్డు నెంబర్ (36) రవీంద్ర నగర్ కాలనీ కౌన్సిలర్ గంధ్రత్ రాజేందర్, వార్డు నెంబర్ 2 మహాలక్ష్మి వాడ చిలుకూరి నగర్ కౌన్సిలర్ సంద నర్సింగ్, దీపాయిగూడ కు చెందిన సీనియర్ నాయకులు బండారి చిన్నయ్య గులాబీ పార్టీకి గుడుబై చెప్పి బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సీనియర్లతో పాటు ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు వెంకన్న సాయి ప్రణయ్, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, లక్ష్మణ్, తదితరులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరు సీనియర్ కౌన్సిలర్లు గులాబీ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరడం చర్చనీయాంశమైంది. ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని పై అవిశ్వాసానికి తెరలేచింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కు చెందిన 34 మంది అవిశ్వాసానికి రహస్యంగా సంతకాలు పెట్టి కలెక్టర్ కు నోటీసు ఇవ్వడానికి సిద్ధమైనట్టు తెలిసింది. అయితే బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ పరిణామాలపై చర్చించి వైస్ చైర్మన్ తో పాటు మున్సిపల్ చైర్మన్ పై కూడా అవిశ్వాసానికి పావులు కలుపుతున్నట్టు బీజేపీలో చర్చ సాగుతోంది. రెండు రోజుల్లో అవిశ్వాసాలపై పార్టీ నేతల అభిప్రాయం వెల్లడి కానుంది.

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర జరుగుతోంది: కెటిఆర్

హైదారబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: సింగరేణి గనులు దక్కకపోవడానికి కారణం బిఆర్ఎస్, బిజెపియే కారణమని ఉపముఖ్యమంత్రి భట్టు విక్రమార్క చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కెటిఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి కుమ్మకై కావాలనే సింగరేణి గనులను కేటాయించడం లేదంటూ వ్యాఖ్యానించారు. ఒకవేళ బొగ్గు గనుల కేటాయింపు జరగకపోతే సింగరేణి తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. గనుల కేటాయింపు జరగనందునే విశాఖ స్టీల్ ప్లాంటులో కార్యకలాపాలు స్తంభించాయని, ప్రైవేట్ పరం అయ్యే స్థితికి వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో సింగరేణి కూడా ప్రైవేట్ పరం కావొచ్చని అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి వేలం పాట ఆపించిన విషయాన్ని గుర్తుచేశారు. తమ తొమ్మిదేళ్ల పాలన కాలంలో మెడ మీద కత్తిపెట్టినట్టు వ్యవహరించినా బొగ్గు గనులను వేలం వెయ్యకుండా కాపాడామని కెటిఆర్ గుర్తుచేశారు.

మనం ఓడిపోలేదు.. గౌరవంగా ప్రజల్లోకి వెళ్లొచ్చు.. వైసీపీ శ్రేణులతో వైఎస్ జగన్

అమరావతి, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): ఎన్నికల ఫలితాలు చాలా ఆశ్చర్యానికి గురిచేశాయని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఇలాంటి ఫలితాలు చూసిన తర్వాత బాధ కలిగిందని తెలిపారు. తాడేపల్లిలోని వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో వైసీపీ శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఫలితాలను చూసిన తర్వాత శకుని పాచికల కథ గుర్తుకొచ్చిందని తెలిపారు. శకుని పాచికల మాదిరిగా ఎన్నికల ఫలితాలు వచ్చాయని.. కానీ ఆధారాలు లేకుండా మాట్లాడలేం అని అన్నారు.

ఈ ఎన్నికల్లో 40 శాతం ఓట్లు మనకు వచ్చాయన్న విషయం మరిచిపోవద్దని వైసీపీ శ్రేణులతో జగన్ అన్నారు. 2019తో పోలిస్తే 10 శాతం ఓట్లు తగ్గాయని తెలిపారు. ఆ పది శాతం జనాలు కూడా చంద్రబాబు మోసాలను, ప్రలోభాలను ఇట్టే గుర్తిస్తారని అన్నారు. ప్రతి కుటుంబానికి మనం చేసిన మంచి ఏంటో తెలుసుని.. విశ్వసనీయతకు మనమే చిరునామా అని అన్నారు. మనం చేసిన మంచే మనకు శ్రీరామరక్ష అని, మనం అందించే పాలనను ప్రజలు మరిచిపోరని చెప్పారు. 2029లో వైసీపీనే ప్రజలు అధికారంలోకి తెచ్చుకుంటారని అన్నారు.

తనకు వయసుతో పాటు సత్తువ కూడా ఉందని జగన్ అన్నారు. చంద్రబాబు పాపాలు పండే కొద్దీ.. ప్రజలతో కలిసి చేసే పోరాటాల్లో తనతో ఎవరూ సాటిరారు అని చెప్పారు. అసెంబ్లీలో మనకు వచ్చిన సంఖ్యాబలం తక్కువే కాబట్టి.. అసెంబ్లీలో మనం చేసేది కూడా తక్కువే అని అన్నారు. అసెంబ్లీలో మనం ఏదో చేస్తామనో నమ్మకం లేదని.. అందుకే ప్రజలకు చేరువై పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. టీడీపీకి ఓటు వేయలేదని దాడులు చేస్తున్నారని.. రెడ్ బుక్స్ అంటూ హోర్డింగ్‌లు పెడుతున్నారని మండిపడ్డారు. ఓడిపోయామన్న భావనను మనసులో నుంచి తీసేయాలని వైసీపీ శ్రేణులకు జగన్ సూచించారు. న్యాయంగా ధర్మంగా మనం ఓడిపోలేదని చెప్పారు. ప్రతి ఇంట్లో వైసీపీ చేసిన మంచి ఉందని.. ప్రతి ఇంటికీ కూడా తలెత్తుకుని పోగలమని తెలిపారు. చెప్పిన పని చేశాం కాబట్టి ప్రజల మధ్యకి గౌరవంగా వెళ్లగలుగుతామని సూచించారు. కాలం గడుస్తున్న కొద్దీ మన పట్ల అభిమానం వ్యక్తమవుతుందని, మళ్లీ రికార్డు మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అప్పటిదాకా మోసపోతున్న వారికి అండగా నిలబడాలని సూచించారు. కార్యకర్తలకు మనం ఎప్పుడూ తోడుగా ఉండాలన్నారు. దాడులకు గురైన వారికి భరోసా ఇవ్వాలన్నారు. రాబోయే రోజుల్లో నేను కార్యకర్తలను కలుస్తానని చెప్పారు.

బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీ సెక్రటరీని కలిసిన తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్-ఛైర్మన్, కె.సునీల్ గౌడ్

న్యూ ఢిల్లీ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్); తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్-ఛైర్మన్, కె.సునీల్ గౌడ్, న్యూ ఢిల్లీ లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీ సెక్రటరీని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు రెండు రాష్ట్రాల సంక్షేమ చర్యలను చర్చించారు.

రక్తహీనతలేని సమాజానికి కృషిచేద్దాం : ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, జూన్ 20 :చిన్నారుల్లో రక్తహీనతలేని సమాజానికి కృషి చేద్దామని, 1-19ఏళ్ల వయస్సు పిల్లలు ప్రతి ఒక్కరు నులిపురుగుల నివారణ మందులను వేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డిపిలుపునిచ్చారు. గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై మాట్లాడారు.

పిల్లల ఎదుగుదలలో లోపం సంభవిస్తే అనారోగ్యం పాలవుతారని, నట్టల నివారణ మందులు వేసుకుంటేనే రక్తహీనత పెరిగి పుష్టిగా ఉంటారని అన్నారు. అనంతరం జవహర్‌నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్లు, కోఆప్షన్‌సభ్యులు, డాక్టర్ శర్మ, ప్రధానోపాధ్యాయుడు అజామోహినుద్దిన్, మున్సిపల్, ప్రభుత్వ దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రొటెం స్పీకర్ గా గోరంట్ల బుచ్చయ్య చౌదరి..

అమరావతి, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): ఏపీ అసెంబ్లీ సమావేశాలు రేపటి నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రొటెం స్పీకర్‌గా టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరితో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు.

మంత్రి కందుల దుర్గేష్

అమరావతి, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో స్టూడియోల నిర్మాణానికి ముందుకు రావాలని రాష్ట్ర పర్యాటకశాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చిత్ర పరిశ్రమ ప్రముఖులను కోరారు. గురువారం సచివాలయం రెండో బ్లాక్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో కోనసీమ ను అద్భుతంగా అభివృద్ధి చేస్తామని అన్నారు.

కోనసీమలో సినిమా చిత్రీకరణలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. ఎకో, టెంపుల్, అడ్వెంజర్ టూరిజాన్ని ప్రోత్సహిస్తామని వివరించారు. పర్యాటక రంగం ద్వారా నిధులు సమకూర్చుకునేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఏపీలో స్టూడియో నిర్మాణానికి ముందుకు రావాలి

రెండ్రోజులు జరుగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు రెండ్రోజులు జరుగనున

ఈటల రాజేందర్ ని కలిసిన రాష్ట్ర ఆర్ఎంపీ పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ కు చెందినరాష్ట్ర ,జిల్లా ,మండల నాయకులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని గురువారం బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు మర్రి మోహన్ రెడ్డి, నేతృత్వం లో ఆర్ఎంపీ పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బ చంద్రశేఖర్,స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పెండెం నాగభూషణం రాష్ట్ర నాయకులు షామీర్పేట్ రమేష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వారి యొక్క సమస్యలను తెలియజేయడం జరిగినది ఇందుకు ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించి మీ సమస్యలు పూర్తిగా మాకు తెలుసు మీకు న్యాయం జరిగేలా చూస్తాను హామీ ఇచ్చినట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి పుర్ర మల్లేష్ ,పల్లెపాటి దామోదర్ , వెంకటేష్ ఘట్కేసర్ మండల ప్రెసిడెంట్ , వెంకన్న కీసర మండల ప్రెసిడెంట్, సుధాకర్ మల్కాజ్గిరి మండల ప్రెసిడెంట్, తదితరులు పాల్గొన్నారు

సంకేపల్లి ప్రాథమిక పాఠశాలలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, జూన్ 20 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం సంకేపల్లి గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎంపిటిసిల ఫోరమ్ అధ్యక్షులు బుర్ర లహరిక-శేఖర్ గౌడ్ జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఆల్ బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, ఏఎన్ఎం సంధ్య, ఆశవర్కర్ మచ్చ రేణుక, వీవో నాగుల రమ్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పిల్లలలో రక్త హీనత, పోషకాహార లోపం నివారణ కొరకు ప్రతి ఒక్కరు సంవత్సరం పిల్లల నుండి 19 సంవత్సరాల వయసు వరకు ప్రభుత్వం ఉచితంగా అందించే ఆల్ బెండజోల్ మాత్రలను తప్పకుండా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు

మానవత్వమే యోగా తత్వం - లిల్లీ మేరి

సిద్దిపేట జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్).: మానవత్వమే యోగా తత్వం అని మనందరికీ తెలిసినంతవరకు యోగ అంటే వివిధ ఆసనాల ద్వారా శారీరిక వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునే ఓ విధానం అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరీ" లిల్లీ మేరి అన్నారు. యోగా దినోత్సవం పురస్కరించు కొని లిల్లీ మేరి మాట్లాడుతూ యోగానికి, మానవత్వాన్ని కూడా జోడించి మరింత మందికి చేరువ చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్ష ఆహ్వానించదగినదని, వసుదైవ కుటుంబం అనే ఇది వృత్తంతో ఈ ఏడాది నిర్వహించనున్న యోగా దినోత్సవం అని, యోగ తత్వము మానవ తత్వము అనే సద్భావన ప్రతి ఒక్కరిలో కలుగజేస్తుందని, మానవ తత్వము యొక్క ప్రధాన అంతరార్థం కూడా సేవా మార్గమే. రండి..., లేవండి ..., మేల్కోండి...! గమ్యం చేరే వరకు విశ్రమించకండి అని వివేకానందుని పిలుపు ఎందరినో ఉత్తేజపరిచిందని, మన భారతీయ ఆరోగ్య, ఆనంద, జీవన కళ యోగాను అంతర్జాతీయంగా ఆచరించేందుకు కృషిచేసిందని, దాని కారణంగా ఐక్యరాజ్య సమితి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకునేలా 2014 డిసెంబర్ 11న తీర్మానం చేసింది. సర్వ ప్రతినిధి సభ ప్రకటించిన ఈ తీర్మానాన్ని 193 సభ్య దేశాలు అంగీకరించగా అందులో 177 దేశాలు సహ ప్రయోజకులుగా వ్యవహరించడానికి ముందుకు రావడం శుభపరిణామం అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి లిల్లీ మేరి అన్నారు. ఈ సందర్భంగా

లిల్లీ మేరి మాట్లాడుతూ పతాంజలి మహర్షి రచించిన యోగ సూత్రాలకు ఆలంబనగా నిలిచాయి. ఆయన రచించిన 195 యోగా సూత్రాలు ఎన్ని తరాలు మారినా నిత్య నూతనంగా ఆచరించబడుతున్నాయి. ఆయన వివరించిన అష్టాంగ యోగాలలో యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి. అయితే వీటిలో ఆసనాలు, ప్రాణాయామము, ధ్యాన క్రియలు యోగా సాధనలో ప్రధానమైనవిగా పేర్కొంటారు. ఈ క్రియలను సాధన చేస్తే గొప్ప ప్రయోజనం కలుగుతుందని లిల్లీ మేరి అన్నారు. యోగా తో ప్రయోజనాలు: ప్రపంచంలో వచ్చిన సాంకేతిక విప్లవము మనిషి జీవనశైలిని ప్రభావితం చేస్తున్నది. మనిషి కాలముతో పరిగెడుతున్నాడు. ఈ క్రమంలో శారీరక శ్రమ కంటే మేధోశ్రమకు ప్రాధాన్యత పెరిగింది. ఇది మానసిక ఒత్తుడలకు, శారీరక రుగ్మతలకు కారణమవుతున్నాయి. ఈ స్థితి నుంచి బయటపడటానికి యోగాను తమ జీవన విధానంలో భాగముగా మార్చుకోవాలి. యోగా అభ్యాసము వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నాయని శాస్త్రీయ పరిశోధనల ద్వారా వెలుగు చూస్తున్న నిజాలు. కండర బలాన్ని పెంచుకోవడంతో పాటు, శరీరాన్ని మనకు అనువైదిగా మార్చుకోవటం, శ్వాసకోస వ్యవస్థను మెరుగుపరుచుకోవటం, మానసిక ఒత్తిడి, ఆందోళనలు దరిచేరకుండా ఉండటం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను తగ్గించుకో వడంతోపాటు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించాలి. అంతేకాదు శారీరక మానసిక వికాసాలతో పాటు, విద్యా రంగము, క్రీడలు, కళారంగాలలో గొప్ప ఫలితాలు సాధించడంలో యోగా గొప్ప శక్తిగా నిలుస్తున్నది. తమ నైపుణ్యాలను మరింత మెరుగుప రుచుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.లిల్లీ మేరి అన్నారు.

నాపై కుట్రలు చేసిన వారిని దేవుడే దండించాడు

-రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బల్దియాపై ఎంఐఎం జెండా ఎగురవేస్తాం

-కలిసి కట్టుగా శ్రమిస్తే 2028లో కరీంనగర్ ఎమ్మెల్యే సీటు మనదే

-ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

కరీంనగర్, జూన్ 20 : (నేటినిజం ప్రతినిధి) నన్ను ఎంఐఎం పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని కుయుక్తులు పన్ని, ఎంఐఎం పార్టీలో చీలికలు తెచ్చి విచ్ఛిన్నం చేయాలనే పన్నాగంతో, నాతో తమపార్టీ కార్పొరేటర్లు లేరని, ఎంఐఎంలో గులాం అహ్మద్ ఒంటరి వాడయ్యాడని అసత్య ప్రచారాలకు తెరలేపారని, నాపదవి నేటికీ పదిలంగా ఉందని, నాపై కుట్రలు చేసిన వారు పదవులు కోల్పోయారని, వారిని దేవుడే దండించాడని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో గులాం అహ్మద్, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనని గెలిపిస్తే, పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ శక్తులకు కరీంనగర్లో చోటు లేకుండా చేస్తానని, కొందరు బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన హామీ ఏమైందని, వాళ్లు కరీంనగర్ ప్రజలకు ఇచ్చిన మాట ఎందుకు నిలబెట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇద్దరు ఓసీలు ఒక బీసీ పోటీ చేస్తే బీసీలంతా ఒక్కటై బిజెపి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ఇప్పుడు ఎవరికి ఎవరు ద్రోహం చేశారో స్పష్టంగా కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు అర్థమవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ముస్లిం ఓటు బ్యాంకు ప్రభావం ఏ మాత్రం చూపలేదని, ముస్లింలంతా ఒక్కటై బిఆర్ఎస్ లేదా కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు వేసినాగానీ, ఈ రెండు పార్టీలు గెలవలేవని కుండబద్దలు కొట్టారు. గెలిచిన అభ్యర్థి మెజారిటీ కంటే ముస్లింల ఓట్లు సగం మాత్రమే నన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతో పొత్తు ఉండదని ఖచ్చితంగా ఈసారి ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని, నగరపాలక సంస్థపై ఎంఐఎం జెండాను ఎగురవేసామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి మేయర్ డిప్యూటీ మేయర్ తో పాటు కోఆప్షన్లన్నీ కైవసం చేసుకుంటామన్నారు. కలిసికట్టుగా శ్రమిస్తే 2028లో కరీంనగర్ ఎమ్మెల్యే

స్థానం సైతం మనదేనన్నారు. ఇందుకోసం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంఐఎం నాయకులను, కార్యకర్తలను కోరారు. డివిజన్లో మెజార్టీ ప్రజల మద్దతు ఉన్న వారికే టిక్కెట్లు ఉంటాయని, సర్వే ఆధారంగా, తమ అధినేతతో పాటు ఎన్నికల పరిశీలకుల సలహాలు సూచనలు పాటిస్తూ టికెట్లు కేటాయింపు ఉంటుందన్నారు. గతంలో తమ పార్టీ అంతర్గత విషయాలను, బయట శత్రువులకు చేరవేసిన వారి విజ్ఞతకే వదిలిపెడుతున్నానని, శత్రువులతో చేతులు కలిపిన వాళ్లు ఎవరైనా సరే ప్రజల్లో విశ్వాసం కోల్పోతారని పేర్కొన్నారు. పవిత్ర బక్రీద్ మాసం సందర్భంగా ఎంఐఎం విజ్ఞప్తి మేరకు ఘనమైన ఏర్పాట్లు చేసిన నగర పాలక సంస్థ మేయర్, కమిషనర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఆతిఫ్ ఆతిన, ఖమరొద్దీన్, ఖాజా, ఇబ్రహీం, కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు అలీ బాబా, అజర్, మాజిద్ హుస్సేన్, వాజిద్ అలీ, సాజిద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే నగల షాపులో దోపిడి..

హైదరాబాద్, జూన్ 20 :మేడ్చల్ మున్సిపల్ పట్టణంలోని జగదాంబ జ్యువెల్లరీ షాపులో పట్టపగలే దొంగలు దోపిడికి పాల్పడ్డారు.. పోలీస్ స్టేషన్ పక్కనే గల జగదాంబ జ్యువెల్లరీ షాపులో గుర్తు తెలియని దుండగులు బుర్కా ధరించి షాపు యజమాని శేశారంపై కత్తితో దాడి చేశారు. అతడి చాతీపై పొడిచి షాపులోని నగలను తన బ్యాగ్ లో వేయమని అరిచాడు . అనంతరం నగల షాపులోని బంగారు అభరణాలను దోచుకువెళ్లారు.. దుకాణానికి వచ్చిన ఇద్దరు దుండగుల్లల్లో ఒకరు బుర్కా ధరించాడు.. వారు పల్సర్ బైక్ పై వచ్చారు . బంగారం దుకాణంలో చోటు చేసుకున్న ఘటనపై సిసి ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి.. దీంతో దుండగుల ఫోటోలు వెలుగు చూశాయి.. షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడ చేరుకొని వివరాలు సేకరించారు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

కేరళ బీసీ కమిషన్ ఛైర్మన్‌తో తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ డా॥ వకుళాభరణం భేటీ

తిరువనంతపురం (కేరళ) జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కేరళ బీసీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ జి. శశిధరన్ తో తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ డాఎఎ వకుళాభరణం భేటీతెలంగాణ బీసీ కమిషన్ మిక్కిలి క్రియాశీలంగా పని చేస్తుందని, ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడంలో ఛైర్మన్ డాఎఎ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, సభ్యుల కృషికి కితాబు ఇచ్చారు కేరళ బీసీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ శశిధరన్. గురువారం నాడు తిరువనంతపురం, వెల్లాయంబలం కౌడియార్, అయ్యన్ కలి భవన్ లో గల కేరళ బీసీ కమిషన్ కార్యాలయంలో డాఎఎ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు మర్యాదపూర్వకంగా జస్టిస్ శశిధరన్ ను కలిశారు. ఈ సందర్భంగా కేరళ ఛైర్మన్, డాఎఎ వకుళాభరణం ను శాలువాతో సన్మానించారు, ఆ రాష్ట్ర కమిషన్ పలు నివేదికల ప్రతులను అందజేశారు. వారిరువురు సుమారు 2 గంటల పాటు సమావేశమయ్యారు. ఈ భేటీ లో అక్కడి కమిషన్ సభ్యుడు డాఎఎ ఎ. వి. జార్జ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీసీ సంక్షేమ పథకాలు, విధులు, నిధుల గురించి డాఎఎ వకుళాభరణం వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ల

శాతంను స్థిరీకరించడానికి డెడికేటెడ్ కమిషన్ గా తాము చేస్తున్న పనిని ఆయనకు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా త్వరలో చేపట్టబోయే సామాజిక, ఆర్థిక కుల సర్వే అంశంపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. తెలంగాణ లో ఎక్కడా లేని విధంగా పథకాలు కొనసాగుతుండడం పట్ల కేరళ ఛైర్మన్ అభినందించారు. ఈ నేపథ్యంగా తెలంగాణ బీసీ కమిషన్ల నివేదికలు, వివిధ పథకాల ప్రభుత్వ ఉత్తర్వులు , ప్రస్తుత బీసీ కమిషన్ కార్యాచరణ ప్రణాళిక మున్నగునవి డాఎఎ వకుళాభరణం, కేరళ ఛైర్మన్ కు అందజేశారు. ఈ కార్యక్రమాలన్నీ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంపూర్ణ సహకారం వల్లనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా చేపట్టగల్గుతున్నట్లు డాఎఎ వకుళాభరణం, శశిధరన్ దృష్టికి తెచ్చారు.

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో జాతీయ శరణార్థుల దినోత్సవం

కరీంనగర్, జూన్ 20 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గురువారం జాతీయ శరణార్థుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా?వి. నరేందర్ రెడ్డి ఏర్పాటుచేసినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. ప్రపంచంలో మానవాళికి అన్ని రకాలుగా సహాయపడాలని ప్రత్యేకంగా ఆహారం, వస్త్రాలను అందించడంలో ప్రధాన పాత్ర పోషించి ఖ్యాతి గడించడమే కాకుండా అత్యుత్తమ జీవనాన్ని కొనసాగించాలని సూచించారు.

నేటి సమాజంలో శరణార్థులు నిర్లక్ష్యానికి గురైయ్యారని, వారి పట్టింపు ఎవరికి పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని, ఇలా వ్యవహరించడం చాలా విచారకరమని తెలిపారు. ప్రతి ఒక్కరు శరణార్థులకు ఆపన్నహస్తం అందించి సేవలో ముందంజలో ఉండాలని తెలిపారు. నేడు ప్రతి ఒక్కరు తీరిక లేకుండా పలు కార్యకలాపాలలో పాల్గొనడంతో శరణార్థులకు ఎటువంటి వసతులు దొరకడం లేదని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది శరణార్థులు ఉన్నారని, వారికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారని చెప్పారు. ఐక్యరాజ్య సమితి వారు సైతం శరణార్థులకు తగు గుర్తింపునివ్వడం ద్వారా వారి సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరు

శరణార్థులకు చేయూతనివ్వడంతో పాటు వారి అభివృద్ధికి పలు వనరులను అందించి సహాయపడాలని కోరారు. విద్యార్థులకు సమాజంలో పలు సమస్యలను ఎదురుకుంటున్నారని, నిర్లక్ష్యానికి గురైన శరణార్థుల గురించి తెలియజేయడానికై పలు కార్యక్రమాలని రూపొందించినట్లు చెప్పారు. ప్రభుత్వం వారు వారి శ్రేయస్సుకై పలు నిధులను కేటాయించారని, సలహాలను ఇస్తున్నారని తెలుపుతూ ప్రతి ఒక్కరు వారి అభివృద్ధికై చేయూతనివ్వడమే కాకుండా తగు సూచనలు చేయాలని కోరారు. నేడు ప్రపంచంలోని యువత వివిధ ఆసాంఘీక శక్తులకు భానిసలవుతు కనీసంగా మాట్లాడలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు.

యువత మరియు ప్రజలు శరణార్థులు ఎదురుకుంటున్న పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారి శ్రేయస్సుకై మరియు సమస్యల పరిష్కారినికై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆదర్శంగా జీవనాన్ని కొనసాగించి ఖ్యాతి గడించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకటి నుండి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి..

-ఒకటవ డివిజన్ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్....

కరీంనగర్, జూన్ 20 : (నేటినిజం ప్రతినిధి) ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలందరూ తప్పకుండా నలిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఒకటో డివిజన్ తీగలగుట్టపల్లి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం తీగల గుట్టపల్లి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ టాబ్లెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఇట్టి టాబ్లెట్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక 1వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. మాట్లాడుతూ నలి పురుగుల ద్వారా పిల్లల్లో శారీరకా ఎదుగుదల ఉండదని , వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందన్నారు . పిల్లలు శారీరకంగా బలంగా ఉన్నప్పుడే చదువుల్లో, ఇతరత్రా అన్ని విషయాల్లో రాణించగలుగుతారన్నారు. ప్రతి ఏటా రెండుసార్లు ప్రభుత్వ పరంగా

చేపడుతున్న నలిపురుగుల నివారణ మాత్రలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పిల్లలకు నలి పురుగుల నివారణ మాత్రలను వేయించాలన్నారు . ఇట్టి కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర వైద్యులు, ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయు రాలు , ఏఎన్ఎం , ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రాసి మ్యాక్స్ 'హెచ్‌డీపీఎస్'తో పత్తిలో అధిక దిగుబడి

హైదరాబాద్, జూన్ 20 : ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుడిగా భారతదేశానికి హోదా ఉంది. కానీ ఉత్పాదకత తక్కువగా ఉంది. ఇది 44వ స్థానంలో ఉంది. వాతావరణం, చీడపీడలు, సాంకేతికతను స్వీకరించడంలో ఆలస్యంతో గత పదేళ్లలో ఉత్పాదకత నిలిచిపోవడానికి కారణం అయ్యాయి. తెలంగాణలో పత్తి ఉత్పాదకతను మెరుగుపరచడానికి హెచ్‌డీపీఎస్ ఒక విధానాన్ని సూచిస్తుంది. ఇది పత్తి రంగంలో గేమ్-ఛేంజింగ్ ఇన్నోవేషన్ గా చెప్పొచ్చు. ఎందుకంటే, ఉత్పత్తి ఖర్చులు పెరగడం, కార్మికుల కొరత తదితర సవాళ్లను పరిష్కరించడం ద్వారా హెచ్‌డీపీఎస్ మంచి భవిష్యత్తును అందిస్తుంది. ఐదు దశాబ్దాల అనుభవం కలిగిన భారతీయ వ్యవసాయ సంస్థ రాసి సీడ్స్, తెలంగాణలో పత్తి దిగుబడిని పెంచేందుకు హెచ్‌డీపీఎస్‌తో ముందుకు వచ్చింది. ఈ రాశి మాక్స్ ప్రాజెక్ట్ అధిక మొక్కలు పెంచడానికి, దిగుబడిని ఆప్టిమైజ్ చేయడానికి అనుకూలమైన వ్యవసాయ శాస్త్రం, జన్యుశాస్త్రాలను ఉపయోగించడంపై దృష్టి పెడుతుంది. ప్రత్యేకంగా ఆర్సీహెచ్ 929 వంటి సంకరజాతులు సమకాలీకరించడానికి అభివృద్ధి చేయబడ్డాయి. సిద్దిపేట జిల్లా నర్సన్నపేట గ్రామానికి చెందిన పత్తి రైతు దాసరి గణేష్ ఏమన్నారంటే.. ఆయన మాటల్లోనే.. ఆధునిక హైబ్రీడ్ విత్తనాలతో దిగుబడి నిలిచిపోవడం, ఉత్పత్తి ఖర్చులు పెరగడం వంటి సవాళ్లను ఎదుర్కొన్నాను. రుతుపవనాల, కూలీ ఖర్చులు నాపై ఒత్తిడిని పెంచాయి. అయితే, హై-డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్ (హెచ్‌డీపీఎస్)తో ఉత్పాదకత పెరిగింది. దీంతో లాభం బాగా వచ్చింది' అని తెలిపారు. గుజరాత్, మహారాష్ట్ర తర్వాత భారతదేశంలో మూడో అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారు, దక్షిణ భారతదేశంలో అతిపెద్దది తెలంగాణ. పత్తి సాగులో అపారమైన సామర్థ్యం కలిగి ఉంది. పత్తి సాగులో ఉత్పాదకత, స్థిరత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో హెచ్‌డీపీఎస్ వంటి వినూత్న విధానాల ద్వారా రాష్ట్రం సిద్ధంగా ఉంది. ఇర్విన్ గ్రామానికి చెందిన కొమరం శ్రీను, ఉప్పులగూడెం గ్రామానికి చెందిన తుమ్మల భాస్కర్ ఏమన్నారంటే.. వాళ్ల మాటల్లోనే.. 'రాసి మ్యాక్స్ ప్రాజెక్టు కింద గణనీయంగా లబ్ధి పొందాం. దిగుబడిలో గణనీయమైన పెరుగుదలను చూశాం, మంచి ఆదాయం వచ్చింది' అని తెలిపారు. రాసి మాక్స్ ప్రాజెక్ట్ మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలలో హెచ్‌డీపీఎస్ విజయవంతంగా అమలు చేసింది. ఈ ప్రాజెక్టులో 18,345 ఎకరాలు, 2,699 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చారు. ఒక్క తెలంగాణలోనే 1,587 మంది రైతులు హెచ్‌డీపీఎస్ స్వీకరించారు. దీంతో సామర్థ్యం, ఉత్పాదకత పెరిగింది. సీఐసీఆర్, సీఈఆర్సీవోటీ, ఐసీఏఆర్, ఏటీఏఆర్ఐ, వ్యవసాయ శాఖ వంటి వ్యవసాయ ఏజెన్సీలు, సంస్థలతో మెకనైజ్డ్ విత్తే పద్ధతులు, సహకారం, శిక్షణ, యాంత్రికరణ మద్దతు, సబ్సిడీ ద్వారా ప్రాజెక్ట్ విజయానికి మరింత మద్దతు ఇచ్చాయి. అంతర్జాతీయ పత్తి నిపుణుడు డాక్టర్ కేటర్ హెక్ తెలంగాణ పత్తి క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పాదకతను పెంపొందించడానికి హెచ్‌డీపీఎస్ సామర్థ్యాన్ని చెప్పారు. ఈ ప్రాంతంలో పత్తి సాగుకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. దీనికి రాసి సీడ్స్ మద్దతు ఉందని పేర్కొన్నారు. వ్యవసాయంలో రాష్ట్రం ముందుకు సాగుతున్నందున.. భారతదేశంలో పత్తి సాగు భవిష్యత్తుకు హెచ్‌డీపీఎస్ ఒక దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు.

మీరు ప్రీమియంలు చెల్లించడంలో విఫలమైనప్పటికీ, ఈ రెండు ఫీచర్లు మీ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని సజీవంగా ఉంచుతాయి

హైదరాబాద్, జూన్ 20 :వినియోగదారులకు సౌలభ్యం మరియు భద్రతను పెంచే లక్ష్యంతో, టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లు రెండు ఫీచర్లను ప్రవేశపెట్టాయి: ప్రీమియం హాలిడే రైడర్ మరియు ప్రీమియం డిలే ప్లాన్‌లు. పాలసీదారులు ఒక సంవత్సరం పాటు తమ ప్రీమియంలను చెల్లించకుండా పోయినప్పటికీ తమ కవరేజీని కొనసాగించడానికి అనుమతించడం ద్వారా ఈ ఎంపికలు టర్మ్ ఇన్సూరెన్స్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులను నిర్దేశించనున్నాయి.

పాలసీ బజార్ డాట్ కామ్ లో టర్మ్ ఇన్సూరెన్స్ హెడ్ రిషబ్ గార్గ్ ఈ ఫీచర్ల ప్రభావాన్ని నొక్కి చెబుతూ "ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించలేమనే భయంతో పాటుగా పాలసీ ల్యాప్ అవుతుందనే భయం, భారతీయులు టర్మ్ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేయడానికి వెనుకాడేందుకు ఒక ప్రధాన కారణమని వేము తెలుసుకున్నాము. ఈ సమస్యను ఎదుర్కోవడానికి, పరిశ్రమ ప్రీమియం హాలిడే రైడర్ మరియు ప్రీమియం డిలే ప్లాన్‌లు వంటి వినియోగదారు-కేంద్రీకృత ఫీచర్స్ ను తెలివిగా ప్రవేశపెట్టింది. వీటిని కస్టమర్‌లు స్వాగతిస్తున్నారని మా అధ్యయనం వెల్లడించింది" అని అన్నారు. ప్రీమియం హాలిడే రైడర్ అనేది మీ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని కొనుగోలు చేసే సమయంలో ఎంచుకోగల ఒక యాడ్-ఆన్ పథకం. అతి తక్కువ మొత్తంలో అదనపు ప్రీమియం చెల్లించడం ద్వారా, మీరు ఈ రైడర్‌ను యాక్టివేట్ చేయవచ్చు, ఇది మీరు ఏ సంవత్సరంలోనైనా ప్రీమియం చెల్లింపు చేయనట్లయితే మీ పాలసీ లాప్ అవ్వదని నిర్ధారిస్తుంది. ఇది మీ విలువైన బీమా కవరేజీని కోల్పోకుండా తాత్కాలిక ఆర్థిక ఇబ్బందులను అధిగమించటానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. అదనపు రైడర్ కోసం చెల్లింపులు చేయరాదనే వారి కోసం, ప్రీమియం డిలే ప్లాన్‌లు చక్కటి పరిష్కారాన్ని అందిస్తాయి, మీరు నిర్దిష్ట సంవత్సరానికి మీ ప్రీమియం చెల్లించలేకపోతే, మీ పాలసీ ల్యాప్ అవ్వదు. మీరు కేవలం మునుపటి సంవత్సరం ప్రీమియంతో పాటు తదుపరి సంవత్సరానికి ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. ఈ అంతర్నిర్మిత ఫీచర్ మీ కవరేజీని అంతరాయం లేకుండా కొనసాగించడానికి తక్కువ ఖర్చుతో కూడిన మార్గాన్ని అందిస్తుంది. ఈ కొత్త ఎంపికలు పాలసీదారులకు టర్మ్